మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 8-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 220 Issue: 220

08 ఫిబ్రవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:49 సూర్యాస్తమయం - సా. 6:11 తిథి సప్తమి తె. 5:02ం వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం స్వాతి తె. 4:57ం వరకు తరువాత విశాఖ యోగం గండ రా. 12:06ం వరకు కరణం విష్టి మ. 3:57 వరకు బవ తె. 5:02ం వరకు వర్జ్యం ఉ. 8:40 నుండి ఉ. 10:26 వరకు దుర్ముహూర్తం సా. 4:40 నుండి సా. 5:25 వరకు రాహుకాలం సా. 4:45 నుండి సా. 6:11 వరకు యమగండం మ. 12:30 నుండి మ. 1:55 వరకు గుళికాకాలం మ. 3:20 నుండి సా. 4:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:13 నుండి ఉ. 6:01 వరకు అమృత ఘడియలు రా. 7:17 నుండి రా. 9:03 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com





## రాజమౌళి సినిమాలోని గ్రాఫిక్స్‌లా దోమలు!

### ప్రభుత్వంపై ఎస్ఎస్ కార్తికేయ వ్యంగ్యాస్త్రం

హైదరాబాద్ నగరంలో దోమల సమస్య ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తూ ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ పోస్ట్ చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): నగరంలో దోమల బెడ దపై ఆయన తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రం సంధించారు. ప్రస్తుతం కార్తికేయ ఒక సినిమా నిర్మాణ పనుల్లో భాగంగా రాత్రిపూట షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో షూటింగ్ ప్రదేశంలో దోమలు విపరీతంగా ఉండటంతో యూనిట్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లైట్ల వెలుతురులో గుంపులు గుంపులుగా తిరుగుతున్న -2 వ పేజీలో...





# తెలంగాణ.. దోమల కార్ఖానా!

## ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలు

### పల్లెల్లో ఇంటి గోడల నిండా మశకాలే.. పట్టణాల్లో వీధులన్నీ దోమల గుంపులే

### ఫాగింగ్ లేదు.. పరిశుభ్రత లేదు.. రోగాలతో ప్రజలు ఆస్పత్రుల పాలు

### హైడ్రాకు వెల్లువలా ఫిర్యాదులు.. చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**జాగ్రత్తలు**

- ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి, ఇళ్లలో నిలిచిన నీటిని తొలగించాలి.
- కిటికీలకు, తలుపులకు మెష్‌లు (జాలీలు) ఏర్పాటు చేసుకోవాలి.
- మధ్యాహ్నం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య దోమల వృద్ధి అధికంగా ఉండే ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలి.

**చికున్‌గున్యా కేసులు ఇలా.. (గత నాలుగేళ్లలో..)**

2021: 220 కేసులు (అనుమానిత)
2023: 4,8000 కేసులు
2024: 13,592 కేసులు (సుమారు 60 రెట్ల పెరుగుదల)
2025 (ఆగస్టు వరకు): 7,176 కేసులు
(కేవలం 8 నెలల్లోనే భారీగా నమోదు)

పల్లెల్లో మోర్ల కంపు.. ఆ కంపుతో తయారవుతున్న దోమల గుంపు.. ఇంటింటికీ చేరుతాయ్.. ఇంటి గోడలపై వాలిపోతాయ్.. ఒంటిపై చేరిపోతాయ్.. ఒంట్లో రక్తాన్ని పీల్చేస్తాయ్. పట్టణాల్లో వీధులన్నీ సంచరిస్తాయ్.. తలపై సుడిగుండంలా తిరుగుతాయ్.. చెవిలో రాగాలు పలుకుతాయ్.. నిద్రలేని రాత్రులు గడిపేలా చేస్తాయ్.. తెలంగాణలో ఎక్కడ చూసినా ఇదే బాధ.. ప్రభుత్వానికి పట్టని ప్రజల వ్యథ.

సండే స్పెషల్ స్టోరీ

తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల కాలంలో దోమల బెడద విపరీతంగా పెరగడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాలు దోమల కార్ఖానాగా మారాయన్న విమర్శలు వస్తున్నాయి. నగరాలు, పట్టణాల చుట్టూ ఉన్న అనేక చెరువులు సరైన నిర్వహణ లేక కలుపు మొక్కలతో నిండిపోతున్నాయి. ఇది దోమల ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది. గుర్రపుడెక్క వంటి మొక్కలను తొలగించడంలో జాప్యం దోమల -2 వ పేజీలో...






## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

### దాదాపు 50 కంప్యూటర్లు ఆహుతి

### ఓటుకు నోటు కేసు ఫైల్స్ దగ్ధం!?

### సీజ్డ్ గదిలో ప్రమాదంపై అనుమానాలు

హైదరాబాద్‌లోని నాంపల్లి మరోసారి అగ్నిప్రమాదానికి వేదికైంది. మొన్నటికి మొన్న ఓ ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు మరణించగా, తాజాగా శనివారం స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం మధ్యాహ్నం కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్ విభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. లోపల రసాయనాలు, కీలక పత్రాలు ఉండటంతో మంటలు వేగంగా ఇతర విభాగాలకు వ్యాపించాయి.

నాంపల్లి/హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): దట్టమైన పొగ కమ్ముకోవడంతో లోపల ఉన్న సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనపై డీఎఫ్‌వో స్పందిస్తూ.. మొదటి అంతస్తులో పలు కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందని చెప్పారు. విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్లు మంటల్లో కాలిపోయాయని వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నామని... అప్పటికే మంటలు వ్యాపించాయని తెలిపారు. రెండో అంతస్తులో కెమికల్ ల్యాబ్ ఉందని... అయితే, మంటలు రెండో అంతస్తుకు వ్యాపించలేదని చెప్పారు. తొలి అంతస్తులో తరువాయి 2 వ పేజీలో...

**ఓటుకు నోటు రికార్డుల నాశనం?: కేటీఆర్**




## టాటా ఈవీలపై 3 లక్షల డిస్కౌంట్ 2

**బంగారం-వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,660 |
| వెండి (గ్రాము): | రూ.285 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,111 |

**విశ్వవాణి**



నీటిలో 30 ఫీట్ల లోతులో మనిషి రక్తం ఆకుపచ్చ రంగులో కనిపిస్తుందట. అంత లోతులో ఎరుపు కాంతి ఉండకపోవడం వల్లే రక్తం ఆకుపచ్చ రంగులో కనిపిస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.



## కేసీఆర్‌ది దొంగ పాస్‌పోర్టుల చరిత్ర

### ఆ చరిత్ర నేను చెరిపేస్తే చెరిగేదా?

### ఆ పాపాల భైరవుడి చరిత్ర చెరిగిపోదు

### వికారాబాద్ సభలో రేవంత్ విమర్శలు

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సీఎం రేవంత్ ఆరోపణల డోస్‌ను మరింత పెంచుతున్నారు. . వికారాబాద్‌లోని పరిగిలో పర్యటించిన ఆయన.. ప్రజా పాలన- ప్రగతి బాట బహిరంగ సభలో పాల్గొని గత పాలనపై కేసీఆర్, బీజేపీపై నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను.. తప్పులను సరిదిద్దుకుంటూ తెలంగాణను ముందుకు తీసుకొని వెళ్తున్నామన్నారు.

వికారాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): రాష్ట్రంలో పదేళ్లు కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లు మోదీ అధికారంలో ఉన్నా రాష్ట్రానికి చేసిందేం లేదని ఎద్దేవా చేశారు. మోదీని చూసి ఓట్లు వేయాలని బీజేపీ నాయకులు అంటున్నారని, ఎవరైనా పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా..?.. అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని మోదీని చూసి ఓటేస్తే గల్లీలో ఉండే బోడిగాడు పనిచేయకపోతే ఢిల్లీకి వెళ్లి అడగారా అంటూ మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు వాళ్ల బీ ఫామ్ బీఆర్ఎస్ ఆఫీసులో తెచ్చుకుంటుని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆరెస్ వి చీకటి ఒప్పందాలంటూ మండిపడ్డారు. నిజంగా మీరు సమస్యలు పరిష్కరించి ఉంటే ప్రజలు మీకే ఓటేసే వారని అన్నారు. ఆనాడు నిజంగా కేసీఆర్, తరువాయి 2 వ పేజీలో...




## బీజేపీ మనిషే


### రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదు

### ముమ్మాటికీ బడే భాయ్‌కి తమ్ముడే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషేనని...అయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ శనివారం బాన్సువాడలో పర్యటించారు.

బాన్సువాడ, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని ఆరోపించారు. రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని అన్నారు. రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి కప్పుకున్న బీజేపీ ముసుగును తొలగించి చూడాలని... ఆయన లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కోరారు. అధికారంలో ఉన్నామని, వారికే ఓటు వేయాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని... మరి రెండేళ్లలో వారి ప్రభుత్వం ఏం చేసిందని కేటీఆర్ ప్రశ్నించారు. మరో రెండేళ్ల తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ఖచ్చితంగా పట్టణాలను కాంగ్రెస్ కంటే గొప్పగా అభివృద్ధి చేస్తామని అన్నారు. మైనారిటీలకు, బీసీలకి భారీ ఎత్తున తరువాయి 2 వ పేజీలో...



## మురికివాడలా మేడారం!

### టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలు.. 3 వేల టన్నుల చెత్త పోగైనట్లు అధికారుల అంచనా

### వ్యర్థాల్లో 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాలు.. రంగంలోకి 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు

మేడారం/ములుగు, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. అయితే, కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు వెనుదిరిగిన అనంతరం మేడారం పరిసరాలు టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెను సవాల్‌గా మారింది. మేడారంతో పాటు కన్నెపల్లి, నార్లాపూర్, తరువాయి 2 వ పేజీలో...




## మార్చి 15 నుంచి 'వాహన్'లోకి టీజీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): రాష్ట్రంలో వాహనాలు కొనుగోలు చేసే వారికి, ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలు దారులకు, కొత్త రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'వాహన్' పోర్టల్‌లో తరువాయి 2 వ పేజీలో...

## క్వాంటం వ్యాలీకి భూమిపూజ



### అమరావతిలో శంకుస్థాపన

**పాల్గొన్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, చంద్రబాబు**

**ఈ డిసెంబర్ నాటికి తొలి కంప్యూటర్** 2

ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీకి శనివారం తొలి అడుగు పడింది. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తో కలిసి చంద్రబాబు ఈ కీలక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ 2025లో విజేతలుగా నిలిచిన బృందాలకు సర్టిఫికెట్లతో సహా నగదు బహుమతుల చెక్కుల్ని అందజేశారు.

## రాశి ఫలాలు

8.2.2026

మేషం: నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఖర్చుల విషయంలో కొంత ఆచితూచి వ్యవహరించాలి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

వృషభం: ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన వ్యవహారాల్లో జాప్యం జరిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మరింత పురోగతి పెరుగుతుంది నిరుద్యోగులు అనుకూల వాతావరణం ఉంటుంది.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాల్లో ఆశించిన విజయం సాధిస్తారు. సోదరుల నుండి కీలక సమాచారం అందుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట పొందుతారు. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో సమస్యలు ఏర్పడతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల మాటలు కొంత బాధ కలిగిస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

సింహం: చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. బంధుమిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూల ఫలితాన్ని ఇస్తాయి.

కన్య: వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. మిత్రులతో వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వివాదాలకు సంబంధించిన కీలక సమాచారం సన్నిహితుల నుండి అందుతుంది. గృహ వాతావరణం సందడిగా ఉంటుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు.

తుల: చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుండి కొంత ఉపశమనం పొందుతారు. గృహమున శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. ఆధ్యాత్మిక చింతన వలన మానసిక ప్రశాంతత లభిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

వృశ్చికం: ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శారీరక శ్రమ పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో మిత్రుల సహాయ సహకారాలు సలహాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగ విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకొని ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రశంసలు అందుకుంటారు. సోదరుల నుండి స్థిరాస్తి లాభం పొందుతారు దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు విశేషమైన గుర్తింపు లభిస్తుంది.

మకరం: వ్యాపారాలలో కష్టానికి తగిన లాభాలు అందుకుంటారు. గృహ నిర్మాణం పనులు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఇతరులు వ్యవహారాల్లో తలదూర్చడం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థికంగా అంతంత మాత్రంగా సాగుతుంది.

కుంభం: అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. చేపట్టిన పనుల్లో శ్రమ కలిగిన సకాలంలో పూర్తి చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. వ్యాపారపరంగా నూతన నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు.

మీనం: ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. ఉద్యోగ విషయమై వారి సహకారంతో పనులు త్వరితగతిన పూర్తి చేస్తారు. చేపట్టిన పనులలో కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. పాత మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది.

# దోమల కార్ఖానా!

మొదటి పేజీ తరువాయి

బెదదను పెంచుతోంది. దోమల నియంత్రణకు సాధారణంగా ఉపయోగించే ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు పకడ్బందీగా అమలు అవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాలనీల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరగడం లేదని పలువురు ఫిర్యాదు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదుల ఆధారంగా మాత్రమే చర్యలు తీసుకోవడం కంటే, నిరంతర పర్యవేక్షణ, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. కానీ, ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఆ దిశగా చర్యలు లేనట్లే కనిపిస్తున్నాయి. దోమల బెడద పెరగడం వల్ల డెంగ్యూ, చికన్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అధికారిక గణాంకాలు ఒక రకంగా ఉన్నప్పటికీ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. వర్షాకాలం వచ్చినప్పుడు మాత్రమే హడావిడిగా నివారణ చర్యలు చేపట్టడం దీర్ఘకాలంలో సమస్యను పరిష్కరించదు. డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి ప్రాథమిక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించడం చాలా ముఖ్యం.

ఏటేటా పెరుగుతున్న చికున్ గున్యా, డెంగ్యూ కేసులు:

తెలంగాణలో 2024-25 కాలంలో సీజనల్ వ్యాధులు మునుపెన్నడూ లేని స్థాయిలో నమోదయ్యాయి. 2021లో కేవలం 220గా ఉన్న అనుమానిత చికున్ గున్యా కేసులు, 2024 నాటికి ఏకంగా 13,592కు పెరిగి దాదాపు 60 రెట్ల వృద్ధిని నమోదు చేశాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10,077 నిర్ధారిత డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. 2025 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో రాష్ట్రంలో 1,588 చికున్‌గున్యా కేసులు నమోదయ్యాయి. ఆగస్టు 2025 నాటికి ఈ సంఖ్య 7,176 అనుమానిత కేసులకు చేరింది. 2025 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు తెలంగాణలో 4,296 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. కేవలం ఏప్రిల్-జూన్ మధ్యే 433 కేసులు రికార్డయ్యాయి. మే 2025 వరకు 74 మలేరియా కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ చర్యలేవి?

జీహెచ్‌ఎంసీలో ఉండాల్సిన ఎంటమాలజీ సిబ్బందిలో దాదాపు 30% పైగా ఖాళీలు ఉన్నట్లు సమాచారం. నగరంలో వేల సంఖ్యలో కాలనీలు ఉంటే, అందుబాటులో ఉన్న వెహికల్ మౌంటెడ్ ఫాగింగ్ మెషీన్లు కొన్ని వందలు మాత్రమే. హైదరాబాద్ చుట్టుపక్కల సుమారు 185 ప్రధాన చెరువులు ఉండగా, అందులో 80% పైగా గుర్రపుడెక్కతో నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. హైదరాబాద్ శివారులోని రాంపల్లి, ఇబ్రహీంబాగ్ వంటి ప్రధాన చెరువులు కూడా గుర్రపు డెక్కకు ఆవాసాలుగా మారాయి. ఇదీ కాక, భారీ వర్షాలు, వరదల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఏడిస్ దోమల వృద్ధికి కారణం అవుతోంది. క్షేత్రస్థాయిలో ఫాగింగ్‌పై అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల వల్ల నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలను కూల్చేందుకు ఏర్పాటైన హైడ్రా.. దోమల నివారణపై ఫిర్యాదులూ స్వీకరిస్తోందంటే, పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక, టైర్-2 పట్టణాల్లోనూ మలేరియా విభాగం సరిగా ఫాగింగ్ చేయడం లేదన్న కంప్లెయింట్లు నిత్యకృత్యం అయ్యాయి.



**డెంగ్యూ వ్యాప్తి**

- 2024: రాష్ట్రవ్యాప్తంగా 10,077 నిర్ధారిత కేసులు.
- జీహెచ్ఎంసీ వాటా: మొత్తం కేసుల్లో దాదాపు 35% - 40% కేసులు
- హాట్‌స్పాట్లు: హైదరాబాద్‌లో గుర్తించిన హై-రిస్క్ ప్రాంతాలు 34,000.
- ఇతర హైరిస్క్ ప్రాంతాలు: వరంగల్, మేడ్చల్‌లో మలేరియా, డెంగ్యూ పాజిటివిటీ రేటు 12 శాతం

# బీజేపీ మనిషే

మొదటి పేజీ తరువాయి

బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ హామీలు అమలు అయితే... ఆ ప్రయోజనాలు పొందిన వాళ్లు మాత్రమే వారికి ఓటు వేయాలని అన్నారు. మిగిలిన వాళ్లు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పెన్షన్ రూ. 4000, మహిళలకు రూ. 2,500, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం వచ్చిన వాళ్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పోచారంను రేవంత్ రెడ్డి బండ బూతులు తిట్టారని, అవినీతి ఆరోరపణలు చేశారని... మరి అలాంటి పార్టీలోకి ఆయన ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కేసీఆర్ బాన్సువాడను అభివృద్ధి చేశారని, జీవితాంతం రుణపడి ఉంటానని కూడా పోచారం చెప్పారని... మరి ఇన్ని మాటలు చెప్పిన వ్యక్తి ఎందుకు కాంగ్రెస్‌లో చేరారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతుకుల కోసం పోచారం కాంగ్రెస్ సంకలో చేరారని సంచలన ఆరోపణలు చేశారు. అయినప్పటికీ వేల మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని అన్నారు. బాన్సువాడలో బీఆర్ఎస్ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కేవలం డబ్బులు ఉన్నంత మాత్రాన పెద్ద నాయకుడు అవ్వలేరని పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పోచారంకు దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని... అప్పుడు ప్రజలు ఎవరి వైపు ఉంటారో తెలుస్తుందని సవాల్ విసిరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి జరిగిందని చెప్పారు. బాన్సువాడకు జరిగిన అభివృద్ధి అంతా ఖచ్చితంగా కేసీఆర్ ప్రభుత్వానికే చెందుతుందని... ఒకవేళ నిజంగానే పోచారం అభివృద్ధి చేసి ఉంటే గత రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

## మార్చి 15 నుంచి 'వాహన్'లోకి టీజీ

మొదటి పేజీ తరువాయి

చేరనుంది. ఈ వాహన పోర్టల్ అందుబాటులోకి రావడం ద్వారా వాహనదారులు ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. దాని ఫలితంగా ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేఅవసరం ఉండదు. 15 మార్చి 2024 నుండి తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'వాహన్' పోర్టల్‌లో చేరనుంది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రవాణాశాఖలో అనే సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే లైసెన్సుల కోసం సారథిని ప్రవేశపెట్టగా...తాజాగా వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం వాహన్ పోర్టల్‌ను అనుసంధానిస్తోంది. ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల వన్ నేషన్ -- వన్ రిజిస్ట్రీ కల సాకారం అయ్యే అవకాశం ఉంది. అంతేకాదు వాహనదారుల ఇబ్బందులకు సైతం ఇక్కడితో ఫుల్ స్టాప్ పెట్టే అవకాశం కూడా లేకపోలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు తీపికబురు చెప్పింది.

# క్వాంటం వ్యాలీకి భూమిపూజ.. అమరావతిలో శంకుస్థాపన

**పాల్గొన్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, చంద్రబాబు**

అమరావతి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): 2026 డిసెంబరు నుంచి ఏపీలో తొలి క్వాంటం కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుందని చంద్రబాబు వెల్లడించారు. క్వాంటం కంప్యూటర్ల తయారీ కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. 85 శాతం మేర క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను దేశానికి, ప్రపంచానికి తయారు చేసి ఎగుమతులు చేసే ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14న ఇంటర్నేషనల్ క్వాంటం డే రోజున 2 ఇండిజినస్ క్వాంటం కంప్యూటర్లను రెఫరెన్సు ఫెసిలిటీ గా ఎస్ఆర్ఎం నుంచి ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. క్వాంటం ద్వారా చేసిన ఆవిష్కరణలు నోబెల్ ప్రైజ్ సాధిస్తే రూ.100 కోట్ల నజరానా ఇస్తామని మరోసారి తెలిపారు. యువ మేధావులు దీనిపై పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. 2030 నాటికి 2.5 లక్షల మంది క్వాంటం నిపుణులు అవసరం అవుతారని చంద్రబాబు అంచనా వేశారు. వైజర్ సంస్థ ద్వారా క్వాంటం కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు పిలుపునిస్తే 50 వేల మంది నేర్చుకుంటున్నారని తెలిపారు. ఐఐటీ మద్రాస్ అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ కోర్సులు అందించినప్పుడు దేశవ్యాప్తంగా 2.08 లక్షల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని, వారిలో 1.04 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ వారే అన్నారు. దశల వారీగా 35 లక్షల మందికి క్వాంటంలో శిక్షణ ఇచ్చేందుకు వైజర్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు క్వాంటం ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచ వ్యాప్తంగా 50 లక్షల మందికి శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం ముందుకు వచ్చిందన్నారు అందులో 10 లక్షల మంది ఏపీ యువతకు శిక్షణ ఇస్తామన్నారు. ఏపీలోని విద్యార్థులంతా ఏఐ అల్గారిథమ్స్‌లో శిక్షణ పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఒక్కటే కాదు, స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి లాంటి అంశాల్లో ఇప్పటికే ముందడుగు వేశామన్నారు. అమరావతి డీప్ టెక్నాలజీ ప్రయాణంలో భాగస్వాములు కావాలని పరిశ్రమల్ని, విద్యా రంగాన్ని, విద్యార్థుల్ని కోరారు. ప్రపంచశ్రేణి ప్రమాణాలతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత క్వాంటమ్ భవిష్యత్తుని నిర్దేశించే ప్రదేశంగా మారుతుందన్నారు.

# గ్రాఫిక్స్‌లా దోమలు!

మొదటి పేజీ తరువాయి

దోమల సమూహాన్ని ఆయన వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'హైదరాబాద్‌లో దోమలు మామూలుగా లేవు, షూటింగ్ చేయడం కూడా కష్టంగా ఉంది' అనే అర్థం వచ్చేలా ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే వైరల్‌గా మారింది. నెటిజన్లు దీనిపై రకరకాలుగా స్పందిస్తున్నారు. 'రాజమౌళి సినిమాలోని గ్రాఫిక్స్‌లా ఉన్నాయి ఈ దోమలు' అంటూ కొందరు సెటైర్లు వేస్తుండగా, మరికొందరు హైదరాబాద్ మున్సిపల్ అధికారులను, ప్రభుత్వాన్ని ట్యాగ్ చేస్తూ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## టాటా ఈవీలపై 3 లక్షల డిస్కౌంట్

న్యూఢిల్లీ: కొనుగోలుదారులకు టాటా మోటార్స్ శుభవార్తను అందించింది. దేశవ్యాప్తంగా ఈవీల పరిధిని మరింత విస్తరించడానికి ఆయా మోడళ్లపై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. కంపెనీకి చెందిన టియాగో ఈవీపై రూ.85 వేల వరకు రాయితీ అందిస్తుండగా, పంచ్ ఈవీపై రూ.1.25 లక్షలు, నెక్సాన్ ఈవీ 3.0పై రూ.65 వేలు, కర్వ్ ఈవీపై రూ.3.10 లక్షలు, హారియర్ ఈవీపై రూ.2.75 లక్షల చొప్పున రాయితీ ఇచ్చారు.

## మురికివాడలా మేడారం!

కొంగల గట్టు వంటి ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జంతు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సుమారు 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అయితే, ఈ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి

ఉన్న సున్నితమైన ప్లాస్టిక్ వస్తువులు ఆహుతయ్యాయని తెలిపారు. అగ్నిప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు కీలక కేసుల సాక్ష్యాధారాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో 'సీజ్డ్ ప్రాపర్టీస్' (స్వాధీనం చేసుకున్న వస్తువులు) భద్రపరిచే గది పూర్తిగా కాలిపోయింది. వివిధ నేరాలకు సంబంధించి సేకరించిన భౌతిక సాక్ష్యాధారాలు బూడిదయ్యాయని అధికారులు చెప్తున్నారు. సుమారు 40 నుంచి 50 సీజ్ చేసిన కంప్యూటర్లు అగ్నికి ఆహుతయ్యాయి. రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు, ఏళ్ల తరబడి విచారణలో ఉన్న ఓటుకు నోటు కేసు ఆడియో, వీడియో ఫైల్స్. ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన కీలక డేటా కూడా ఈ కంప్యూటర్లలోనే ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం సీజ్డ్ గదిలోనే ప్రమాదం జరగడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## షార్ట్ సర్క్యూట్ వల్లే : డీసీపీ శిల్పవల్లి

ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ అగ్నిప్రమాదంపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎఫ్.ఎస్.ఎల్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కీలక కేసుల విచారణ జరుగుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా కావాలని సాక్ష్యాలను రూపుమాపేందుకు ఈ పని చేశారా? లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా, అగ్నిప్రమాదంపై సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందిస్తూ... ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు అగ్నిప్రమాదంపై సమాచారం అందిందని చెప్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. భవనం తొలి అంతస్తులో కంప్యూటర్లు ఉంటాయని డీసీపీ తెలిపారు. మంటల్లో ఏయే ఫైళ్లు కాలిపోయాయనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. మంటలను ఆఫీస్ బోయ్ తొలుత గమనించాడని... వెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం కూడా చేశాడని తెలిపారు. ఈ క్రమంలో అతడు అస్వస్థతకు గురయ్యాడని... వెంటనే 108లో ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో నలుగురు ఉద్యోగులు లోపల ఉన్నారని, మంటలను గమనించిన వెంటనే వారు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు.

## ఓటుకు నోటు రికార్డుల నాశనం?: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ... ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

# కేసీఆర్‌ది దొంగ పాస్‌పోర్టుల చరిత్ర

మొదటి పేజీ తరువాయి

మోడీ నిధులు ఇచ్చి ఉంటే వాళ్లకు ఇవాళ ఇల్లు ఇల్లు తిరిగి ఓట్లు అడగాల్సిన పరిస్థితి ఎందుకు? వస్తుందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు చేస్తే.. రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలు ఇచ్చేది లేదని కేసీఆర్ పడావు పెట్టారన్నారు. చేవెళ్ల దగ్గర ఉన్న ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు శిలాఫలకం ఇందుకు సజీవ సాక్ష్యమన్నారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీలు గోదావరి జలాలు అందిస్తే వేల ఎకరాలకు సాగు నీరు అందేదన్నారు. రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమే పార్టీ మారామని ఆనాడు సబితా ఇంద్రారెడ్డి చెప్పారని, మరి చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి అనుమతులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నలు వేశారు. మీరు చేసిన ద్రోహానికి ప్రజలను కలిసే అర్హత మీకు ఉందా? అంటూ రేవంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోజమ్మ రొయ్యల పులుసు తిని రాయలసీమను రత్నాల సీమ చేస్తానన్నాడు కేసీఆర్ ... కానీ రంగారెడ్డికి గోదావరి జలాలు ఇస్తానని చెప్పలేదని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ కు సంబంధించి భూసేకరణ త్వరలోనే పూర్తిచేస్తాం.. ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యానికి రంగారెడ్డి జిల్లా బలైందని, లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లల్లో కూలేశ్వరం అయిందన్నారు. కాళేశ్వరంతో వాళ్ల కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకున్నారని, వ్యాపారాలు పెట్టుకున్నారు తప్ప రంగారెడ్డి ప్రజలకు, తెలంగాణ ప్రజలకు చేసిందేం లేదన్నారు. గోదావరి జలాలు తెచ్చి తాండూరు, పరిగి,వికారాబాద్ సస్యశ్యామలం చేసే బాధ్యత మాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాండూరుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాగ్నా నుంచి తాగునీరు అందిస్తామన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజక వర్గాలకు కృష్ణా జలాలు తరలించి 1 లక్ష 50 వేల ఎకరాలకు నీరు అందిస్తామని హామీఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ రోడ్డు పూర్తి చేయలేదని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది చనిపోయారు.. ఈ పాపం కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిది కాదా అంటూ మండిపడ్డారు. వికారాబాద్ ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారబోతోందన్నారు. రెండేళ్లలో పేదలకు రేషన్ కార్డులు అందించాం, సన్నబియ్యం అందించామన్నారు. కేసీఆర్, కల్వకుంట్ల కిషన్ రావ్ రాసిపెట్టుకోవాలన్నారు. రాబోయే ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యమే కొనసాగుతుందన్నారు. శుక్రాచార్యుడు ఫామ్ హౌస్ నుంచి ఊర్లమీదకు మారీచుడు, సుబాహును పంపించాడని హరీష్ రావు, కేటీఆర్ లపై సెటైర్లు వేశారు. వాళ్లు మేం చేసే అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని, ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తున్నానని హరీశ్, కేటీఆర్ విమర్శిస్తున్నారని, కేసీఆర్ దొంగ పాస్ పోర్టుల చరిత్ర నేను చెరిపేస్తే చెరిగేదా అంటూ బీఆర్ఎస్ పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం పాపాల భైరవుడి చరిత్ర చెరిగిపోదని కేసీఆర్ పై సెటైర్లు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ది ఫెవికాల్ బంధమని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజల్ని కోరారు.




# బీజేపీ గెలిస్తే మంచిర్యాలలో శివాజీ విగ్రహం

**మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హామీ**

మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కోరారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠంపై బీజేపీ అభ్యర్థిని కూర్చొబెట్టాలని... అప్పుడు పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల, కాగజ్‌నగర్‌లలో దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విజయ్ సంకల్ప్ సభ, మంచిర్యాలలో రోడ్ షోలో పాల్గొని బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ వేదికలపై నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ప్రజల ఉత్సాహం స్పష్టం చేస్తుందని అన్నారు. మహారాష్ట్ర ప్రజలు అక్కడ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం అందించారని... ఇది నగరాల్లో వేగంగా అభివృద్ధి పనులు జరిగేందుకు తోడ్పడుతుందని చెప్పారు. ఇప్పుడు తెలంగాణలో కూడా అదే మార్పు కనిపిస్తుందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ఊహించిన కలలు, అవకాశాలు... బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతితో చెదిరిపోయాయని ఆరోపించారు. ఒకప్పుడు రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు అప్పుల్లో కూరుకుపోయిందని అన్నారు. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాలలో అభివృద్ధి, పాలనలో పారదర్శకత, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్రల మధ్య గోదావరి జలాల వివాదం ఉందని... 2015లో తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నానని, అప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ తనను కలిసి గోదావరి జలాల అంశం మాట్లాడారని చెప్పారు. ఆ సమయంలో ఇరు రాష్ట్రాల మధ్య గోదావరి జలాల విషయంలో ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తాను ఎటువంటి వివాదం లేకుండా తెలంగాణకు నీరు అందించాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఇది మహారాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలగకుండా పొరుగు రాష్ట్రాలు నదీ జలాలను ఉపయోగించుకోవడానికి అనుమతించాలనే తమ నిబద్ధతను చూపిస్తుంది అని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో లబ్ధి పొందడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి-గడ్చిరోలి జాతీయ రహదారి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ, అమృత్ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాల ద్వారా నగరాలకు భారీగా నిధులు అందిస్తుందని తెలిపారు. అయితే ఆ డబ్బు కేవలం బీజేపీ అధికారంలో ఉంటే మాత్రమే ప్రజలకు చేరుతుందని అన్నారు. ఇతర చోట్ల ఆ డబ్బులను సరైన రీతిలో వినియోగించడం లేదని ఆరోపించారు.అందుకే పట్టణాభివృద్ధి, పారదర్శక పాలన, మెరుగైన భవిష్యత్తు కోసం బీజేపీ అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించాలని కోరారు. అలాగే, తాను మంచిర్యాలకు రావడం ఇది మొదటిసారి కాదని ఫడ్నవీస్ తెలిపారు. గతంలో చాలాసార్లు మంచిర్యాలకు వచ్చానని ఫడ్నవీస్ గుర్తుచేసుకున్నారు. తనకు ఇక్కడ చాలా మంది స్నేహితులు ఉన్నారని తెలిపారు. తన కళాశాల రోజుల్లో తాను ఇక్కడి థియేటర్లలో సినిమాలు చూసేవాడినని చెప్పారు. మంచిర్యాల పట్టణంతో తనకు మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## హైడ్రా కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

**ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు**

**హైడ్రా కార్యాలయంలో తొలిసారి ఏర్పాటు**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్ నగర ప్రజలు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకున్నారు. హైడ్రా కార్యాలయంలో ఆయన తొలిసారి 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టగా, గంటలోనే 36 మంది ఫోన్ చేశారు. భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు బయటకు కూడా విస్తరించాలని ప్రజలు కోరారు. తమ ప్రాంతాల్లోని చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుర్రపు డెక్కపెరిగి దోమలతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇతర చెరువుల్లాగే తమ ప్రాంతంలోని చెరువులనుకూడా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణి ఉంటుంది. కానీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు కమిషనర్ 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టారు. హైడ్రా కార్యాలయం వరకు రాలేనివారు సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం కల్పించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగగా, స్వయంగా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను వారికి అందజేశారు. వారం రోజుల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 040-29565750, 040-29565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి పలువురు ఫోన్లు చేసి తమ వద్ద కూడా చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అయితే హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకేనని రంగనాథ్ స్పష్టం చేశారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేశామని, త్వరలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని అన్నారు.

## మున్సి'పోల్స్' రోజున సెలవు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(ఈవార్తలు) : మున్సిపల్ ఎన్నికలు జరిగే ఈ నెల 11న స్థానిక సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ సెలవు వర్తిస్తుంది. ప్రైవేట్ పరిశ్రమలకు కూడా ఆ రోజున సెలవు ఇవ్వాలని ఎస్ఈసీ సూచించింది.

# రేవంత్ బతుకు అవినీతి

**నోట్ల కట్టలతో దొరికిన దొంగ.. కేసీఆర్ మంచోడు కాబట్టే వదిలి పెట్టిండు**

**కాంగ్రెస్, బీజేపీ నేతలవి అబద్ధాలు: హరీశ్**

గజ్వేల్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు) : 'గోడలకు సున్నాలు వేసుకొనే రేవంత్‌రెడ్డి.. పెయింటర్ నుంచి పొలిటీషియన్ దాకా ఆయన బతుకంతా అవినీతిమయం. నోట్లకట్టలతో దొరికిననాడే రేవంత్‌రెడ్డికి బేడీలు వేసి ఊరేగించాల్సి ఉండె. కేసీఆర్ మంచోడు కాబట్టే ఆయన్ని ఆనాడు వదిలిపెట్టిండు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం, జిన్నారం, సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణాల్లో శనివారం నిర్వహించిన రోడ్‌షోలు నిర్వహించారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల క్లిప్‌లను ప్రజలకు చూపారు. సీఎంగా ఉన్న సమయంలో కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తే, ప్రస్తుత సీఎం ఆ పథకాల్లో కోత పెడుతున్నారని ఆరోపించారు. నీతి, నిజాయితీ, పద్ధతి లేకుండా వయసులో పెద్దవాడైన కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి తగదని హితవు పలికారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి తెలంగాణ ప్రజలు సిగ్గుపడుతున్నారని చెప్పారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ మనోడు



కాదని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ కోసం ఉద్యమాలు జరుగుతున్న సమయంలో చంద్రబాబు కాళ్ల దగ్గర రేవంత్‌రెడ్డి ఉన్నాడని, ఆయన ఆంధ్రోళ్లకు సద్దులు మోసిన తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. కేసీఆర్ నీళ్లను ఒడిసి పడితే.. రేవంత్‌రెడ్డి ఆంధ్రకు నీళ్లను పంపే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పథకాలపై ప్రశ్నిస్తే తమపై లేనిపోని కేసులు పెడుతున్నాడని, ఎన్ని కేసులు పెట్టినా చెప్పిన హామీలను అమలు చేసే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఏం చేసిందని బీజేపీ ఓట్లు అడుగుతున్నదని, ప్రజలు తమ ఓటును బీజేపీకి వేసినా, మోరీలో ఒక్కటేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, అప్పుడే సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయవచ్చని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు నోరుతెరిస్తే అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని హెచ్చరించారు. మిషన్ కాకతీయలో రూ.55 వేల కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ ఎంపీ మాట్లాడుతుండని, అసలు మిషన్ కాకతీయకు ఖర్చు పెట్టిందే రూ.5 వేల కోట్లని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.84 వేల కోట్లు ఖర్చు పెడితే.. లక్ష కోట్ల అవినీతి చేశారని బద్నాం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, ఇన్‌చార్జి పాల సాయిరాం, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, నాయకులు ప్రకాశ్‌చారి, రాజేశ్, పాండురంగారెడ్డి, విక్రంరెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, దేవి రవీందర్, మధు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెసోళ్లు నన్ను చంపేస్తారనుకున్నా

**బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణపై మల్లారెడ్డి కామెంట్స్**

మేడ్చల్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది అని మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆరోపించారు. మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తమపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారని ఆరోపించారు.కాంగ్రెస్ వాళ్లు నన్ను కూడా చంపేస్తారు అనుకున్నాను అని వాపోయారు. మా పార్టీ కౌన్సిలర్లతో, మా నాయకుడి ఇంట్లో మీటింగ్ పెట్టుకుంటే డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ కావాలని డీజే బండి తెచ్చి ఫుల్ సౌండ్ పెట్టి డిస్టర్బ్ చేశారు అని మాజీమంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. పాటలు బంజేయండి అని అడిగినందుకు వజ్రేష్ యాదవ్ అనుచరులు తమ పార్టీ కార్యకర్తల మీద దాడి చేశారని ఆరోపించారు. మీకు ప్రజల్లో మంచి పేరు లేకపోతే మా మీద దాడి చేయడం ఏంటి? అని మాజీమంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్న సంగతి తెలిసిందే. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలను అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ఎస్ మరోవైపు బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఎన్నికల ప్రచారం రసవత్తరంగా మారింది. మున్సిపల్, కార్పొరేషన్లలో జరిగే ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీలు నియమించిన ఇన్‌చార్జిలు పర్యటనలలో బిజీబిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి నివాసంలో కార్పొరేటర్లతో మాజీమంత్రి మల్లారెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం అటుగా వెళ్తున్నారు. డీజే సౌండ్ ఎక్కువగా ఉండటంతో బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సౌండ్ తగ్గించాలని కోరారు. మాజీమంత్రి మల్లారెడ్డి తన అనుచరులను పంపించి సౌండ్ తగ్గించమని రిక్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అయితే డీజే నిర్వాహకుడు తాళం వేసుకుని వెళ్లిపోవడంతో తమ అనుచరుడు ఢిల్లీ పరమేశ్ వెళ్లి తీగలాగేందుకు ప్రయత్నించినట్లు మాజీమంత్రి మల్లారెడ్డి చెప్పుకొచ్చారు. ఇంతలో కాంగ్రెస్ శ్రేణులు దూసుకువచ్చారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మాజీమంత్రి మల్లారెడ్డి అనుచరుడు ఢిల్లీ పరమేశ్ తలకు గాయాలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తనను కూడా చంపేస్తారని తాను భయపడినట్లు మాజీమంత్రి మల్లారెడ్డి తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ నేతలపై జరుగుతున్న దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. కాంగ్రెస్ గూండాల దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మల్లారెడ్డికి ఫోన్ చేసి జరిగిన దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. మరోవైపు మర్రి రాజశేఖర్‌కు సైతం ఫోన్ చేసి దాడి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, ఎమ్మెల్యే కేపీ వివేకానందలను మాజీమంత్రి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిల వద్దకు వెళ్లాలని కేటీఆర్ ఆదేశించారు. జూబ్లీహిల్స్ లో కార్పొరేటర్ దేదీప్య పైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఆయన అనుచరులు చేసిన దాడిని సైతం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. దేదీప్యతో ఫోన్లో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్న కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను దేదీప్య వద్దకు వెళ్లాలని ఆదేశించారు. ఈ క్రమంలో దేదీప్యను పార్టీ శ్రేణులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

# 60 సీట్లున్న బస్సులో 100 మంది!

**అందుకే గొడవలు: జగ్గారెడ్డి**

సంగారెడ్డి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.

# రేపటితో పుర ప్రచారం బంద్

**రేపు సాయంత్రం 5 గంటలకు మైకులు కట్**

**11న పోలింగ్.. 11 వేల కెమెరాలతో నిఘా**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): తెలంగాణ పురపాలక ఎన్నికల ప్రచారంక్లైమాక్స్‌కు చేరుకున్నది. మంగళవారం సాయంత్రం మొదలైన ఎన్నికల ప్రచార హోరు.. సోమవారం సాయంత్రం ఐదుగంటలతో ముగియనున్నది. కొన్ని రోజుల ప్రచారపర్వం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నది. రేపు సాయంత్రంతో మైకులు మూతపడనుండటంతో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆఖరి ప్రయత్నాల్లో మునిగిపోయారు. ప్రచారానికి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అన్ని పార్టీల అగ్రనేతలు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజుకు 5 నుంచి 6 మున్సిపాలిటీలను చుట్టేస్తూ సుడిగాలి ప్రచారంతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యర్థులు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. పురపాలక ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నది. ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 'స్మార్ట్' నిఘా వ్యవస్థను సిద్ధం చేస్తున్నది. ఈ నెల 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరుగనున్నది. 100% వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షిస్తామని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటూ 30 జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 11,000 కంటే ఎకువ స్మార్ట్ కెమెరా యూనిట్లను ఏర్పాటు చేస్తున్నది.

## డిగ్రీ పట్టాతో ఉద్యోగం కూడా!

**ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు గోల్డెన్ ఛాన్స్**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగం సంపాదించడం ప్రతి విద్యార్థి కల. ఆ కలను సాకారం చేస్తూ డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో కలిసి వినూత్నమైన 'జాబ్ అచీవర్ – బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్' ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇది విద్యార్థులకు బంగారు బాట వేయనుందని వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాం లో అడ్మిషన్స్ జరుగుతున్నాయని, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఇప్పటికే మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇందులో చేరడానికి మార్చ్ 15 చివరి తేదీగా పేర్కొన్నారు. ప్రొ. చక్రపాణి శనివారం క్యాంపస్ లో టీసీఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ లీనా టిప్రే, ప్రతినిధి నరేందర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి, ఓఎస్డీ ప్రొ. రాబింద్రనాథ్ సోలమన్, ప్లేస్ మెంట్ అధికారి డా. పి. వేణు గోపాల్ రెడ్డి లతో కలిసి పోస్టర్ ను విడుదల చేశారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

సంగారెడ్డి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లాలోని పోచారం వద్ద ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఓఆర్ఆర్ నుంచి సర్వీసు రోడ్డు పైకి ఎగిరి పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మౌనిక (36), నవీన్ (30) అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హరిప్రసాద్, హర్ష, అమృత, సుశ్రుతలను పటాన్‌చెరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరిలో సుశ్రుత పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బోరంపేటకు చెందిన వీరంతా జూపార్కుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చేతగాని సీఎం రేవంత్: కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులను ఎప్పుడు అరెస్టు చేస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రశ్నించడం తెలిసిందే. వారిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై కిషన్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రికి చేతకాక వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కానీ బాధ్యతారాహిత్యంతో తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో కలిసి ఉన్నామని చెప్పుకోవాలని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి వల్లనో, కేంద్ర ప్రభుత్వం వల్లనో చర్యలు తీసుకోవడం లేదని మాపై నిందలు వేయవద్దని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటానంటే రేవంత్ రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి, ఇక్కడి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. తన పేరు లేదా కేంద్రం పేరు చెప్పి రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరోజైనా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అడ్డుకోవడం కోసం సోనియా గాంధీ కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఒక్కటయ్యాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## ఓటుకు నోటు ఆధారాలు ధ్వంసం చేయడానికే!

**ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదంపై ఆర్ఎస్పీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీనిని రీట్వీట్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు అత్యంత కీలకమైన, గట్టి భద్రత ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని, అనేక సున్నితమైన కేసులకు సంబంధించిన ఆధారాలు(2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా ) ఇందులో భద్రపరచి ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏమిటి? దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. అమెరికాలో ఎంతోమంది చిన్నారులను అపర కుబేరులకు అర్పించిన లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్ జైలులో అనుమానాస్పదంగా చనిపోయాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా, ఎప్‌స్టీన్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే.

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

అమరావతి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. ఈ బదిలీలలో పలు మున్సిపాలిటీలు, యూడీఏలు, కార్పొరేషన్లలో కీలక అధికారులు ఉన్నారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎం. జస్వంత్‌రావును నియమించగా.. అక్కడ పనిచేస్తున్న బి. బాలస్వామిని విజయనగరం మున్సిపాలిటీకి బదిలీ చేశారు. పల్నాడు యూడీఏ కార్యదర్శిగా పనిచేస్తున్న జి. సాంబశివరావును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా నియమించగా...అక్కడ ఉన్న టి. వెంకటకృష్ణయ్యను పల్నాడు యూడీఏ సెక్రటరీగా నియమించింది.ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్న ఒకరికి పోస్టింగ్ ఇవ్వగా... ఇద్దరిని సీడీఎంఏకురిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇకపోతే గుంతకల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీఎంఏ నయీం అహ్మద్‌ను ఆదోనికి బదిలీ చేసింది. అక్కడ ఉన్న కృష్ణను సీఆర్‌డీఏకు బదిలీ చేసింది.మరోవైపు ఏలూరు యూడీఏ కార్యదర్శిగా వెయిటింగ్‌లో ఉన్న పి.సింహాచలంను నియమించారు. ఒంగోలు యూడీఏ కార్యదర్శిగా ఉన్న ఆర్ చండి దేవసేనను తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది ప్రభుత్వం.విజయవాడలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె. శివరామ్‌ప్రసాద్‌ను వినుకొండ కమిషనర్‌గా... వినుకొండలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం. సుభాష్ చంద్రబోస్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు కళ్యాణదుర్గంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎస్. నూర్ అలీఖాన్‌ను కమలాపురం నగరపంచాయతీ కమిషనర్‌గా నియమించగా...అక్కడ పనిచేస్తున్న ప్రహ్లాద్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# మెడి సిబ్బందికి ఐఎఫ్ఎంఎస్!

**హెల్త్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత**

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ వ్యవస్థను ప్రభుత్వ గుర్తింపు పొందిచన ఇంటిగ్రేట్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎఫ్ఎంఎస్) ద్వారా కలపాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య కోరారు. ఆస్పత్రుల్లో ప్రతి విభాగంలో రోగులకు ఎంతో సేవ చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం కనికరం చూపాలని విన్నవించారు. ఈ మేరకు శనివారం హెల్త్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ఆయన ముందుంచారు. 'బెడ్ సైడ్ వ్యవస్థకు స్వస్తి పలకాలి. ప్రతి కార్మికుడికి కనీస వేతనం ద్వారా రూ.26000 కల్పించాలి. ప్రతి కార్మికుడికి ఈపీఎఫ్, ఈఎస్ఐ ప్రభుత్వం నామ్స్ ద్వారా కట్టాలి. విధి నిర్వహణలో కార్మికుడికి ఎటువంటి అనారోగ్యం పాలైన మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. మహిళ కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి' అని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కమిషనర్‌ను కలిసినవారిలో ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లపుదాసు శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగించేందుకు మోదీ కుట్ర

**జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సభలో అసదుద్దీన్ ఒవైసీ**

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): దేశంలో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ తొలగించేందుకు ప్రధాని మోడీ కుట్ర చేస్తున్నారని ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జామా మజీద్ సమీపంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో అసదుద్దీన్ పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా ముస్లింలకు నాయకత్వం అప్పగించదని అది కేవలం ఎంఐఎం తోనే సాధ్యమని ఆయన తెలిపారు. ఆర్ఎస్ఎస్ బిజెపిలు దేశంలో మత కలహాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. చైనా-లడక్ లో జరిగిన ఘర్షణలను మోదీ ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. మోదీ - అమిత్ షా ప్రచారం చేసినా హైదరాబాద్‌లో బీజేపీ గెలవదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే ఎమ్మెల్యే సంజయ్, జీవన్ రెడ్డి కొట్లాడుతున్నారని.. ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు 2028 ఎన్నికల్లో కేసీఆర్ చెంతకు చేరుతారని జోస్యం చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా ఎంఐఎం అభ్యర్థి ఉంటాడని ధీమ వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పతంగి గుర్తుపై ఓటు వేసి ఎంఐఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## అమెరికాతో డీల్.. రైతులకు భద్రత

**ట్రేడ్ డీల్‌పై పురందేశ్వరి ట్వీట్**

రాజమండ్రి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశంలోని రైతులకు సంపూర్ణ భద్రత కల్పిస్తుందని బీజేపీ నేత, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ ఒప్పందం ద్వారా రైతు ప్రయోజనాలను కాపాడుతూనే, వ్యవసాయ ఎగుమతులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆమె తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం గోధుమ, బియ్యం, మక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి ప్రధాన పంటలపై ఎలాంటి సుంకాల తగ్గింపులు లేదా కోటాలు లేవని పురందేశ్వరి స్పష్టం చేశారు. కాబూలీ శనగ, పచ్చి బఠాణీ వంటి వాటితో పాటు నారింజ, చిలగడదుంప వంటి ఉద్యాన పంటల రైతుల ప్రయోజనాలకు కూడా పూర్తి రక్షణ లభిస్తుందని ఆమె వివరించారు. దీనివల్ల లక్షలాది మంది రైతులకు ఆదాయ భరోసా కొనసాగుతుందని చెప్పారు. మరోవైపు, ఈ ఒప్పందం ద్వారా భారత్‌లో తయారైన ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో సులభంగా ప్రవేశం లభిస్తుందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇది దేశీయ ఎగుమతులకు ఊతమిచ్చి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దృఢమైన నాయకత్వం వల్లే రైతు భద్రత, ఆహార భద్రత, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. "భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందం దేశీయ వ్యవసాయ రంగానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తోంది. ఎగుమతులకు కొత్త ఊపునిస్తూనే, దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేలా సమతుల్య విధానంతో ఈ ఒప్పందాన్ని రూపొందించారు. ఒప్పందం ప్రకారం, సున్నితమైన వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ఎలాంటి సుంకాల రాయితీలు కానీ, మార్కెట్ యాక్సెస్ కానీ ఇవ్వలేదు. ముఖ్యంగా అరటి, మామిడి, సిట్రస్ పండ్లు, బెర్రీలు వంటి ఉద్యాన పంటలకు సంపూర్ణ రక్షణ కల్పించారు. దీంతో దిగుమతుల ఒత్తిడి లేకుండా రైతుల ఆదాయానికి భద్రత చేకూరనుంది. ఉల్లిపాయలు, మష్రూమ్స్, వెల్లుల్లి, బంగాళాదుంప, బఠాణీ, శనగలు, బీన్స్ వంటి ప్రధాన కూరగాయలన్నీ రక్షణ పరిధిలోనే ఉన్నాయి. విదేశీ పోటీ నుంచి దేశీయ రైతులకు భరోసా కల్పిస్తూ, ధరల స్థిరత్వాన్ని కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆహార భద్రత, గ్రామీణ జీవనోపాధికి భంగం కలగకుండానే వాణిజ్యాన్ని వృద్ధి చేసే దిశగా ఈ ఒప్పందం దోహదపడనుంది" అని వివరించారు.

## ఇద్దరు కుమార్తెలతో తల్లి ఆత్మహత్య

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): తిరుపతి జిల్లా పుత్తూరులో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ తల్లి తన ఇద్దరు కన్నబిడ్డలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, పుత్తూరు పట్టణంలోని కృష్ణానగర్ 3వ వీధిలో నివసించే పద్మ అనే మహిళ తన కుమార్తెలు తేజ (7), లాస్య (5)తో కలిసి ఇంట్లోనే నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అప్పటివరకు ఆడుతూ పాడుతూ కనిపించిన చిన్నారులు విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి స్థానికులు, ఇరుగుపొరుగు వారు కన్నీరుమున్నీరయ్యారు. పద్మ భర్త ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. వీరిది ప్రేమ వివాహం. అయితే, కొంతకాలంగా కుటుంబ ఖర్చులు పెరగడం, అప్పుల భారం అధికమవడంతో పద్మ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. భర్త సంపాదన కుటుంబ పోషణకు సరిపోకపోవడంతోనే ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకుని ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఆత్మహత్య పరిష్కారం కాదని, మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం లేదా ప్రభుత్వ హెల్ప్‌లైన్‌లను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## లడ్డూ కల్తీని సుబ్బారెడ్డి ఒప్పుకున్నారు
## జగన్ కు ఏంటి బాధ?: శ్రీనివాసవర్మ

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ నివేదిక ప్రకారం నిబంధనల ఉల్లంఘన జరిగిందని చెప్పారు. లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని అన్నారు. కానీ, ఈ వ్యవహారంలో వైసీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. కల్తీ నెయ్యి విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముగ్గురూ కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని శ్రీనివాసవర్మ అన్నారు. కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ అని ప్రశ్నించారు. బోలేబాబాకు పాల ఉత్పత్తి, డెయిరీ లేకపోయినా నెయ్యి తయారు చేశారని వివరించారు. టెండర్ల నిబంధనల్లో పెద్ద ఎత్తున మార్పులు చేశారని... అవినీతి కోసం అలా చేశారని అన్నారు. ఆ నెయ్యితోనే స్వామివారికి హారతి ఇస్తామని... అలాంటి నెయ్యిని కల్తీ చేశారని మండిపడ్డారు. అర్హత లేని వారికి నెయ్యి కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారుశ.

## మారిన పది 'ఇంగ్లిష్' పరీక్ష తేదీ

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ఇంగ్లీషు పరీక్ష తేదీని మారుస్తూ పాఠశాల విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని అధికారులు సూచించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 20న జరగాల్సిన ఇంగ్లీషు పరీక్షను మార్చి 21వ తేదీన నిర్వహించనున్నారు. ఉగాది, రంజాన్ పండుగలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ మార్పు చేసినట్టు విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ ఒక్క పరీక్ష తేదీ మినహా మిగిలిన అన్ని పరీక్షల షెడ్యూల్ యథాతథంగా కొనసాగుతుందని తెలిపింది.





# శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): మహా శివరాత్రికి శ్రీశైలం దేవస్థానం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రతీ ఏడాది నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. ఈక్రమంలో ఈ శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్, బోర్డు సభ్యులు ఆహ్వానించారు. మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి 18 వరకు శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఆలయ పండితులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం ఇచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు సీఎంకు వివరించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. అదే విధంగా మహానందిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఆహ్వానించారు.

**15న టీటీడీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వైభవమ్**

మరోవైపు తిరుమల తిరుతి దేవస్థానం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, కపిలతీర్థం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణిలలో మహాశివరాత్రి ఆధ్యాత్మిక వైభవమ్ ను సాయంత్రం 06 గం.ల నుండి అర్ధరాత్రి 12 గం.ల వరకు నిర్విరామంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్‌డీపీపీ, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. పూర్వ కాలంలో మహాశివరాత్రి సందర్భంగా సనాతన హిందూ ధర్మ సంప్రదా యంలో భాగంగా భక్తులు ఆలయాలకు చేరుకుని రాత్రంతా భజనలు, హరికథలు తదితర భక్తి కార్యక్రమాలతో జాగరణ చేసేవారు. ప్రస్తుతం అదే పందాలో భక్తులను సంప్రదాయ పద్ధతిలో భక్తి మార్గం వైపు నడిపించేందుకు తిరుపతిలోని సదరు కేంద్రాలలో భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులందరూ విచ్చేసి పరమ శివుని అనుగ్రహం పొందాలని కోరడమైనది. లింగోద్భవ సమయా నంతరం భక్తాదులకందరికి ప్రసాద వితరణ చేయనున్నారు. తిరుపతి మహతి క్షేత్రంలో ఎం. సరళ బృందంచే శివస్తోత్ర పారాయణం, జి. ప్రభాకర్ శర్మచే పురాణ ప్రవచనం, సి. హరనాథ్ నేతృత్వంలో మోహినీ భస్మాసుర నృత్య రూపకం, జయంతి సావిత్రి ఆధ్వర్యంలో భక్త శిరియాళ హరికథ, సంప్రదాయ పాఠశాల విద్యార్థినులు ఆధ్వర్యంలో శివ భజనామృతం చేపడుతారు. కపిలతీర్థంలో వి. ప్రసన్న లక్ష్మీ బృందంచే శివస్తోత్ర పారాయణం, శ్రీ ఆముదాల మురళి ఆధ్వర్యంలో పురాణ ప్రవచనం, సి. హెచ్. జగదీష్ ఆధ్వర్యంలో లింగోద్భవ వైభవం నృత్య రూపకం, శ్రీ వై. వేంకటేశ్వర్లుచే సతీ తులసి హరికథ, సంప్రదాయ పాఠశాల విద్యార్థినులు ఆధ్వర్యంలో శివ భజనామృతం చేపట్టనున్నారు. అన్నమాచార్య కళామందిరంలో జి. ఇందిరారాణి బృందంచే శివస్తోత్ర పారాయణం, వి. నిర్మలా బాయ్ చే పురాణ ప్రవచనం, సి.హెచ్. అజయ్ కుమార్ బృందంచే పార్వతి పరిణయం నృత్య రూపకం, జె. కృష్ణ కుమారి చే పార్వతి పరిణయం హరికథ, సంప్రదాయ పాఠశాల విద్యార్థినులుచే శివ భజనామృతం కార్యక్రమాలను చేపడుతారు. రామచంద్ర పుష్కరిణిలో జె. రాజకుమారి బృందంచే శివస్తోత్ర పోరాయణం, కె. నారాయణ రావు చే పురాణ ప్రవచనం, సి. సాయి కిషోరి బోస్ ఆధ్వర్యంలో శివ లీలలు నృత్య రూపకం, ఎం. రాముడు ఆధ్వర్యంలో భక్త కన్నప్ప హరికథ, సంప్రదాయ పాఠశాల విద్యార్థినులచే శివ భజనామృతం నిర్వహిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో ఫిబ్రవరి 15న మహాశివరాత్రి ఆధ్యాత్మిక వైభవమ్ నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, కపిలతీర్థం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణిలలో మహాశివరాత్రి ఆధ్యాత్మిక వైభవమ్ ను సాయంత్రం 06 గం.ల నుండి అర్ధరాత్రి 12 గం.ల వరకు నిర్విరామంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

# చంద్రబాబు విజన్ భేష్: జితేంద్ర సింగ్



అమరావతి,ఫిబ్రవరి 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక అద్భుతమైన దార్శనికుడని, ప్రధాని నరేంద్ర మోదీ చెప్పే "డబుల్ ఇంజిన్" ప్రభుత్వానికి ఆయనే అసలైన నిదర్శనమని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కొనియాడారు. చంద్రబాబు రేపటిలో జీవిస్తూ, ఎల్లుండి గురించి కలలు కంటారని ప్రశంసించారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేవలం ఒక భవన నిర్మాణానికి కాదని, భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు పునాది అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. చంద్రబాబు ముందుచూపు, పాలనా వేగాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. "హైదరాబాద్‌లో అంతర్జాతీయ వైద్య సదస్సు నిర్వహించడానికి సరైన వేదిక లేనప్పుడు, హైటెక్ సిటీలోని కన్వెన్షన్ హాల్ గురించి తెలిసింది. అప్పుడే చంద్రబాబు దార్శనికత మాకు పరిచయమైంది. ఇప్పుడు ఏపీలో మరోసారి అదే వేగాన్ని చూస్తున్నాం. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ సైన్సెస్ ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం వచ్చాక కేవలం కొన్ని నెలల్లోనే అన్ని అనుమతులు లభించాయి. గత శనివారమే ఆ కేంద్రాన్ని జాతికి అంకితం చేశాం. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే ఎంత వేగంగా అభివృద్ధి జరుగుతుందో చెప్పడానికి చంద్రబాబే సరైన ఉదాహరణ" అని ఆయన వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరిస్తూ, భవిష్యత్తులో రక్షణ, భద్రత, ఆరోగ్యం, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తేనుందని జితేంద్ర సింగ్ అన్నారు. "సాధారణ కంప్యూటర్లతో పోలిస్తే క్వాంటమ్ కంప్యూటర్లు అత్యంత వేగవంతమైనవి. క్వాంటమ్ ఎన్‌క్రిప్షన్‌ను ఛేదించడం దాదాపు అసాధ్యం. దీనివల్ల మన దేశ భద్రత మరింత పటిష్టమవుతుంది. ఆరోగ్య రంగంలో, క్యాన్సర్ వంటి వ్యాధులకు రేడియేషన్ చికిత్స అందించేటప్పుడు, క్వాంటమ్ టెక్నాలజీతో కచ్చితంగా కణితి ఉన్న చోటే ప్రభావం చూపి, దుష్ప్రభావాలను నివారించవచ్చు" అని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వివరించారు. ప్రధాని మోదీ దార్శనికతతో భారత్ నేడు జాతీయ క్వాంటమ్ మిషన్ ప్రారంభించిందని, అమెరికా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన నిలిచిందని మంత్రి గుర్తుచేశారు. ఈ మిషన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 6,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. "రాబోయే ఎనిమిదేళ్లలో 1,000 ఫిజికల్ క్యూబిట్‌ల సామర్థ్యం గల క్వాంటమ్ కంప్యూటర్లను అభివృద్ధి చేయడం, 2,000 కిలోమీటర్ల పరిధిలో సురక్షిత క్వాంటమ్ కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేయడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఈ ప్రయాణంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. అమరావతి ప్రాజెక్ట్ కోసం ముఖ్యమంత్రి రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను చూసి తాను ఎంతో సంతోషించానని జితేంద్ర సింగ్ అన్నారు. చంద్రబాబు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ టెక్నాలజీలో బీటెక్, ఎంటెక్ వంటి కోర్సులను కూడా ప్రారంభించవచ్చని సూచించారు. "పవిత్ర అమరావతి నగరం నుంచే నేడు భారతదేశ క్వాంటమ్ ప్రస్థానం ప్రారంభమవుతోంది. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందన్న నమ్మకం నాకుంది" అని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, పలువురు శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్ భద్రతపై కూటమి కుట్రలు

**మాజీ ఎంపీ గోరంట్ల విమర్శలు**

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఈవార్తలు): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ సంచలన కామెంట్స్ చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో గోరంట్ల మాధవ్ శనివారం మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన వైఎస్ జగన్‌ను ఇరుకు రోడ్లలో, పల్లెటూళ్ల మీదుగా తీసుకువెళ్లడం దారుణమని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించి, రెండు రోజుల ముందుగానే రూట్ మ్యాప్‌తో సహా సమాచారం ఇచ్చామని తెలిపారు. దానిపై చాలా నింపాదిగా ముందు రోజు రాత్రి స్పందించిన పోలీసులు... విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యను సాకుగా చూపి, రూట్ మార్చుకోవాలంటూ నోటీసు ఇచ్చారని అన్నారు. పోలీసుల నోటీసులకు అంగీకరించి... ముందు అనుకున్నట్లు వారధి, కనకదుర్గమ్మ ఫ్లైవర్ మీదుగా కాకుండా, మంగళగిరి బైపాస్, ఖాజా వెస్ట్ బైపాస్, నల్లగుంట, గుంటుపల్లి మీదుగా దాదాపు 50 కి.మీ ప్రయాణించి ఇబ్రహీంపట్నం చేరుకున్నారని చెప్పారు. అయితే జగన్ ఇబ్రహీంపట్నంకు ప్రయాణించే క్రమంలో తాడేపల్లి మొదలు ప్రతి చోటా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయన వెంట రాకుండా కుట్ర చేశారని అన్నారు. అయినా వేలాదిగా అభిమానులు తరలి రావడంతో దాదాపు 50 కి.మీ ప్రయాణానికి 5 గంటలకు పైగా సమయం పట్టిందని అన్నారు. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వైఎస్ జగన్ ఇబ్రహీంపట్నం నుంచి తిరిగి వచ్చేటప్పుడు కూడా పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు. చివరకు ఎక్కడి నుంచి తీసుకువెళుతున్నారో కూడా చెప్పలేదని అన్నారు. రాత్రి వేళ ఇబ్రహీంపట్నం నుంచి నేరుగా వచ్చే అవకాశం ఉన్నా, చెప్పా పెట్టకుండా రూట్ మార్చేశారని ఆరోపించారు. కనీసం వైఎస్ జగన్‌గారి వ్యక్తిగత సిబ్బందికి కూడా రూట్ గురించి సమాచారం ఇవ్వలేదని అన్నారు. రాజధాని ప్రాంతంలోని ఊళ్లలో నుంచి ఇరుకు రోడ్ల మీదుగా తీసుకొచ్చారని చెప్పారు. భద్రతకు ఏ మాత్రం అనువుగా లేని ప్రాంతాల మీదుగా... రాత్రి వేళల్లో ఒక మాజీ సీఎం, అత్యంత ప్రజాదరణ ఉన్న నేతను అలా తీసుకురావడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని గోరంట్ల మాధవ్ చెప్పారు. అలా ఏకపక్షంగా వైయస్ జగన్ కాన్వాయ్‌ని మళ్లించడం ప్రభుత్వ కుట్రగా భావిస్తున్నామని అన్నారు.






# త్వరలో మలేషియాలో తొలి భారత కాన్సులేట్

## ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: భారత్, మలేషియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. మలేషియాలో త్వరలోనే తొలి భారత కాన్సులేట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం కౌలాలంపూర్‌లో జరిగిన 'సెలామత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి మోదీ హాజరయ్యారు. కాన్సులేట్ ఏర్పాటు నిర్ణయంతో ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ప్రధాని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ చొరవతో మలేషియాలోని భారతీయ సమాజంతో సంబంధాలు మరింత విస్తృతం అవుతాయని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ప్రధాని ప్రకటనపై అక్కడి ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆరో తరం వరకు ఉన్న మలేషియాలోని భారత సంతతి పౌరులకు ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా కార్డుల అర్హతను పొడిగించడంపై ప్రవాస భారతీయులు సంతోషంగా ఉన్నారని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, మలేషియా అభివృద్ధికి, ఇరు దేశాల స్నేహాన్ని బలోపేతం చేయడంలో భారత సంతతి ప్రజల పాత్రను కొనియాడారు. భారత్-మలేషియా భాగస్వామ్యాన్ని ఆయన 'ఇంపాక్ట్' గా అభివర్ణించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ చరిత్రను గుర్తుచేసుకుంటూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు. ఆహారపు అలవాట్ల నుంచి భాష వరకు ఇరు దేశాల మధ్య అనేక సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ పర్యటనలో భాగంగా మరికొన్ని కీలక ప్రకటనలు కూడా చేశారు. కౌలాలంపూర్‌లోని యూనివర్సిటీ మలయాలో ప్రత్యేకంగా 'తిరువళ్లువార్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు విద్యార్థుల కోసం తిరువళ్లువార్ స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలోనే యూపీఐ చెల్లింపుల సౌకర్యం మలేషియాలోనూ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 800 మంది కళాకారులతో ప్రదర్శించిన భారత సంప్రదాయ నృత్య ప్రదర్శన మలేషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం.

### మలేసియా ప్రధాని, నేను స్నేహితులం: మోదీ

మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, తాను ఎప్పటి నుంచో స్నేహితులమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన ప్రధాని కాకముందు నుంచే తనకు పరిచయం ఉందని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మలేసియా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి కమ్యూనిటీ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం, మోదీ ఇద్దరూ ఒకే కారులో కలిసి కమ్యూనిటీ ప్రోగ్రామ్ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, భారత సంతతి సమాజం ఉన్న రెండో అతిపెద్ద దేశం మలేసియా అన్నారు. రోటీ కనై - మలబార్ పరోటా, కొబ్బరి, సుగంధ ద్రవ్యాలు వంటి పదార్థాలు కొచ్చిలో ఉన్నా, కౌలాలంపూర్‌లో ఉన్నా వీటి రుచులు ఇరు దేశాల ప్రజలకు సుపరిచితమే అన్నారు. మలేషియా ప్రధాని మంచి సింగర్ అని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇటీవల ఆయన పాడిన ఒక భారతీయ పాట వీడియో వైరల్ అయిందని గుర్తు చేశారు. 2026లో తన తొలి విదేశీ పర్యటన ఇదేనని ఆయన గుర్తు చేశారు. అందరూ సంక్రాంతి పండుగ చేసుకుని ఉంటారని స్థానిక దక్షిణ భారత సంతతి ప్రజలను ఉద్దేశించి అన్నారు. తమిళ సంతతికి చెందిన వారు ఇక్కడ దశాబ్దాలుగా ఉంటున్నారని, వివిధ రంగాల్లో వారు సేవ చేస్తున్నారని కితాబిచ్చారు. భారతదేశ ప్రస్తుత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు ఎస్ జైశంకర్, నిర్మలా సీతారామన్, ఎల్ మురుగన్ తమిళనాడుకు చెందినవారేనని తెలిపారు.

# ఎప్‌స్టీన్ ఫైళ్లలో అనిల్ అంబానీ పేరు

## మహిళను ఏర్పాటు చేయాలని కోరినట్లు చాటింగ్ వివరాలు

### అమెరికా న్యాయశాఖ డాక్యుమెంట్లలో సంచలన విషయాలు



న్యూయార్క్: ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి సంబంధించిన ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడి, జైలులో ఆత్మహత్య చేసుకున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తేలింది. వీరిద్దరి మధ్య జరిగిన వాట్సాప్ సందేశాలు, సంభాషణల వివరాలను అమెరికా న్యాయ శాఖ తాజాగా విడుదల చేసిన పత్రాల్లో బయటపెట్టింది. ఈ డాక్యుమెంట్ల ప్రకారం, 2017 నుంచి 2019 మధ్యకాలంలో వీరి మధ్య పలుమార్లు సంభాషణలు జరిగాయి. ఈ సంభాషణల్లో అత్యంత వివాదాస్పదమైనది 2017 మార్చి 9న జరిగింది. ఇందులో అనిల్ అంబానీ, 'నాకోసం ఎవరిని తీసుకొస్తావు?' అని ఎప్‌స్టీన్‌ను అడిగారు. దీనికి ఎప్‌స్టీన్ స్పందిస్తూ, 'మీ కోసం ఒక పొడవైన స్వీడిష్ సుందరాంగిని తీసుకొస్తాను' అని సమాధానమిచ్చాడు. ఆశ్చర్యకరంగా, ఈ సందేశానికి అనిల్ అంబానీ కేవలం 20 సెకన్లలోనే 'అయితే ఏర్పాటు చేయి' అని బదులివ్వడం ఈ పత్రాల్లో స్పష్టంగా ఉంది. ఈ సందేశాలతో పాటు వీరి మధ్య వ్యాపారం, ప్రపంచ వ్యవహారాలు, పారిస్‌లో కలుసుకునే ప్రణాళికల గురించి కూడా చర్చలు జరిగాయి. 2018లో దావోస్‌లో జరిగిన సదస్సులో డొనాల్డ్ ట్రంప్ గురించి కూడా మాట్లాడుకున్నారు. 2019 మేలో అనిల్ అంబానీ న్యూయార్క్ వస్తున్నట్లు చెప్పగా, తన నివాసానికి రావాలని, అవసరమైన వ్యక్తులతో రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేస్తానని ఎప్‌స్టీన్ ఆహ్వానించాడు. వీరిద్దరూ కలుసుకున్నట్లు వారి సహాయకులు కూడా ధ్రువీకరించారు. అంతేకాకుండా, అనిల్ అంబానీ హాలీవుడ్ కనెక్షన్ల గురించి చెబుతూ, నటి స్కార్లెట్ జోహాన్సన్‌తో తదుపరి సినిమా ఉందని పేర్కొనగా, తనకు "యంగ్ బ్లాండ్స్" (యువరాశులైన అందమైన అమ్మాయిలు) ఇష్టమని ఎప్‌స్టీన్ హాస్యంగా స్పందించాడు. ఈ ఆరోపణలపై స్పందించేందుకు అనిల్ అంబానీ ప్రతినిధి నిరాకరించారు. ఒకప్పుడు బిలియనీర్‌గా వెలుగొందిన అనిల్ అంబానీ ఆస్తులు ఇటీవలి కాలంలో గణనీయంగా తగ్గాయి. భారత్‌లో బ్యాంకు రుణాల ఎగవేత కేసులోనూ ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో లైంగిక నేరస్థుడిగా ముద్రపడిన ఎప్‌స్టీన్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నట్లు బయటపడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2019లో సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై అరెస్ట్ అయిన ఎప్‌స్టీన్, విచారణ కొనసాగుతుండగానే జైలులో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

# రీల్ చేస్తుండగా ఉరి.. మహిళ మృతి

లక్నో: సోషల్ మీడియా రీల్స్ మోజు, లైకుల పిచ్చి యువతను ఎంత ప్రమాదంలోకి నెడుతోందో చెప్పడానికి ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటనే నిదర్శనం. సరదా కోసం చిత్రీకరించాలనుకున్న ఓ దృశ్యం చివరకు విషాదాంతమై, ఓ యువతి ప్రాణాలను బలిగొంది. వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన 27 ఏళ్ల మోహిని అనే మహిళకు సోషల్ మీడియాలో రీల్స్ చేయడం అలవాటు. ఈ క్రమంలోనే తన ఇంట్లో ఉరి వేసుకుంటున్నట్లు నటించే సన్నివేశాన్ని చిత్రీకరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం మెడకు తాడు బిగించుకుని ఓ స్టూల్‌పై నిల్చుని తన మొబైల్ ఫోన్‌లో వీడియో రికార్డ్ చేయడం ప్రారంభించింది. అయితే, కొన్ని క్షణాల్లోనే సీన్ రివర్స్ అయింది. ఆమె బ్యాలెన్స్ కోల్పోవడం లేదా కాలు జారడంతో స్టూల్ పక్కకు పడిపోయింది. దీంతో మెడకు బిగిసిన ఉరి నిజంగానే ఆమె ప్రాణాలను క్షణాల్లో తీసేసింది. ఈ విషయాన్ని మొదట గమనించింది ఆమె నాలుగేళ్ల కుమార్తె. గదిలోకి వచ్చిన చిన్నారి, తల్లి ఉరికి వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. ఆ అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు అక్కడికి పరుగెత్తుకొచ్చి, దృశ్యం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నప్పటికీ, రీల్ చిత్రీకరిస్తుండగా జరిగిన ప్రమాదంగానే భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా గడువు

కీవ్: దాదాపు నాలుగు సంవత్సరాలుగా జరుగుతోన్న యుద్ధం ముగింపునకు ఒప్పందం కుదుర్చుకోవడానికి ఉక్రెయిన్, రష్యా దేశాలకు జూన్ నెలాఖరు వరకు అమెరికా గడువు ఇచ్చిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. అమెరికా విధించిన గడువులోగా లక్ష్యం నెరవేరకపోతే దానిని సాధించేందుకు ట్రంప్ యంత్రాంగం ఇరుపక్షాలపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. "ఈ వేసవి ప్రారంభం నాటికి యుద్ధాన్ని ముగించాలని అమెరికన్లు సూచించారు. జూన్ నాటికి అన్ని వ్యవహారాలను కొలిక్కి తీసుకురావాలని చెప్పారు. యుద్ధానికి తెరదించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కచ్చితమైన షెడ్యూల్ కావాలని అమెరికన్లు అడిగారు. దీని ప్రకారం వారు ఇరు దేశాలపై ఒత్తిడి తీసుకు వచ్చే అవకాశం ఉంది" అని జెలెన్‌స్కీ కీలక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య దాదాపు నాలుగేళ్లుగా యుద్ధం జరుగుతోంది. యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది.

# చైనాలో నకిలీ పిచ్చాసుపత్రులు

### బీమా నిధుల కోసం ఎత్తుగడలు




బీజింగ్: చైనాలో పెరుగుతున్న వృద్ధ జనాభా కొత్త సమస్యలకు దారితీస్తోంది. తాజాగా నకిలీ పిచ్చాసుపత్రుల పేరిట భారీ స్థాయిలో ఇన్సూరెన్స్ స్కామ్‌లు జరుగుతున్నట్లు మీడియా కథనాలు వెలుగులోకి తెచ్చాయి. వృద్ధులను, నిస్సహాయులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ వైద్య బీమా నిధులను కొల్లగొట్టడమే ఈ మోసాల ప్రధాన ఉద్దేశం. వివరాల్లోకి వెళితే, షియాంగ్‌యాంగ్, యిచాంగ్ నగరాల్లోని డజన్ల కొద్దీ ప్రైవేట్ మానసిక చికిత్స కేంద్రాలు ఉచితంగా లేదా చాలా తక్కువ ఫీజుతో రోగులను చేర్చుకుంటున్నాయి. ఉచిత భోజనం, ఆశ్రయం కల్పిస్తామనే ఆశ చూపి వృద్ధులను, మద్యానికి బానిసలైన వారిని ఆకర్షిస్తున్నాయి. అనంతరం, వారికి చికిత్స అందించినట్లు నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వ బీమా సంస్థల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు క్లెయిమ్ చేస్తున్నాయి. ఒక్కో రోగిపై రోజుకు సుమారు 140 యువాన్ల వరకు ఖర్చయినట్లు చూపిస్తూ నిధులను దారి మళ్లిస్తున్నాయి. ఈ నకిలీ ఆసుపత్రుల్లో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నట్లు తేలింది. రోగులను శారీరకంగా, మాటలతో హింసించడం, వారిచేత ఆసుపత్రి పనులు బలవంతంగా చేయించడం వంటివి వెలుగు చూశాయి. అంతేకాకుండా, ఒకసారి చేరిన తర్వాత వారిని సంవత్సరాల తరబడి బయటకు వెళ్లకుండా బంధిస్తున్నట్లు కూడా తెలిసింది. ఈ కుంభకోణం చైనాలోని వృద్ధుల సంరక్షణ వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా ఎత్తిచూపుతోంది. ఉపాధి కోసం యువత పట్టణాలకు వలస వెళ్లడంతో గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు ఒంటరిగా మిగిలిపోతున్నారు. తక్కువ పెన్షన్లు, బలహీనమైన ప్రభుత్వ సేవలు అందుకుంటున్న వీరు మోసగాళ్ల ఉచ్చులో సులభంగా చిక్కుకుంటున్నారు. కుటుంబ సంరక్షణపై ఆధారపడిన చైనా సంప్రదాయ వ్యవస్థ, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విఫలమవుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కూనో నేషనల్ పార్కులో ఐదు చీతా కూనల జననం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్కులో 'ప్రాజెక్ట్ చీతా' మరో కీలక మైలురాయిని అందుకుంది. నమీబియా నుంచి తీసుకొచ్చిన 'ఆశా' అనే ఆడ చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. రెండేళ్లలో ఆశా పిల్లలకు జన్మనివ్వడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ పరిణామం భారత్‌లో చీతాల పునఃప్రవేశ కార్యక్రమం విజయవంతం అవుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ శుభవార్తను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సోషల్ మీడియా 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. ఇది రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. "ఈ కొత్త జననాలతో భారత్‌లో పుట్టిన చీతా కూనల సంఖ్య 24కు, మొత్తం చీతాల సంఖ్య 35కి చేరింది. అటవీ సిబ్బంది, పశువైద్యుల అవిశ్రాంత కృషి వల్లే ఇది సాధ్యమైంది" అని ఆయన తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కూడా ఈ విషయంపై హర్షం వ్యక్తం చేశారు. "ఆశా వారసత్వం ముందుకు సాగుతోంది. తన ఐదు కూనలకు భారత్ స్వాగతం పలుకుతోంది" అని ఆయన పోస్ట్ చేశారు. భారత గడ్డపై ఇది ఎనిమిదో విడత చీతాల జననం అని, వన్యప్రాణి సంరక్షణలో ఇది చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. 2022 సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ నమీబియా నుంచి తీసుకొచ్చిన 8 చీతాలను కూనో పార్కులో విడుదల చేశారు. ఆ మొదటి బృందంలో ఆశా కూడా ఉంది. ఇదివరకే 2024 జనవరి 3న ఆశా మూడు కూనలకు జన్మనిచ్చింది. ఇక, ఈ నెల 28న బోట్స్వానా నుంచి మరో 8 చీతాలు మధ్యప్రదేశ్‌కు రానున్నాయి.



# తీర్పు గెలిచి.. గుండెపోటుతో మరణించి!

అహ్మదాబాద్: గుజరాత్‌లో తీవ్ర విషాదాన్ని నింపిన ఓ ఘటన వెలుగులోకి వచ్చింది. కేవలం రూ.20 లంచం తీసుకున్నారన్న ఆరోపణపై 30 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేసిన ఓ మాజీ పోలీస్ కానిస్టేబుల్, నిర్దోషిగా తీర్పు వచ్చిన మరుసటి రోజే కన్నుమూశారు. న్యాయం కోసం దశాబ్దాలుగా ఎదురుచూసి, చివరికి గెలిచినా ఆ విజయాన్ని ఆస్వాదించలేకపోయిన ఆయన కథ అందరినీ కదిలిస్తోంది. వివరాల్లోకి వెళితే, అహ్మదాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన బాబుభాయి ప్రజాపతిపై 1996లో రూ.20 లంచం తీసుకున్నారని అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో 2004లో సెషన్స్ కోర్టు ఆయనను దోషిగా తేల్చి, నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ బాబుభాయి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన అప్పీల్ ఏకంగా 22 ఏళ్ల పాటు పెండింగ్‌లో ఉండిపోయింది. సుదీర్ఘ విచారణ అనంతరం, ఈ ఏడాది ఫిబ్రవరి 4న హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. సాక్షుల వాంగ్మూలాల్లో పొంతన లేదని, ప్రాసిక్యూషన్ ఆరోపణలను నిరూపించడంలో విఫలమైందని పేర్కొంటూ బాబుభాయిని నిర్దోషిగా ప్రకటించింది. తీర్పు వచ్చిన వెంటనే బాబుభాయి తన న్యాయవాది నితిన్ గాంధీని కలిసి ఆనందం వ్యక్తం చేశారు. "నా జీవితంపై పడిన కళంకం ఇప్పుడు తొలగిపోయింది. దేవుడు నన్ను ఇప్పుడు తీసుకెళ్లినా ఫర్వాలేదు" అని ఆయన భావోద్వేగంతో అన్నట్లు న్యాయవాది తెలిపారు. అయితే, ఆ సంతోషం ఒక్కరోజు కూడా నిలవలేదు. మరుసటి రోజే (ఫిబ్రవరి 5న) ఆయన గుండెపోటుతో సహజ మరణం పొందారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో గెలిచి, ఆ విజయాన్ని ఆస్వాదించకుండానే బాబుభాయి మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది.

# రష్యా వర్సిటీలో భారతీయ విద్యార్థిపై దాడి

### మరో 8 మందికి గాయాలు

మాస్కో: రష్యాలోని బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని ఒక మెడికల్ యూనివర్సిటీ హాస్టల్‌లో కత్తితో దాడి జరిగిన ఘటనలో ఒక భారతీయుడు సహా ఎనిమిది మంది గాయపడ్డారు. ఒక టీనేజ్ కుర్రాడు కత్తితో వైద్య విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థులు ఉంటున్న హాస్టల్‌లోని స్పోర్ట్స్ హాలులోకి ప్రవేశించి అక్కడున్న విద్యార్థులపై దాడి చేశాడు. అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పోలీసులు అరెస్టు చేస్తున్న సమయంలో వారిపై కూడా దాడికి పాల్పడ్డాడని, తనను తాను కూడా కత్తితో గాయపరుచుకున్నాడని రష్యా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి మేజర్ జనరల్ ఇరినా వోల్క్ తెలిపారు. నిందితుడిని 15 ఏళ్ల టీనేజర్ గా గుర్తించారు. గాయపడిన విద్యార్థులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థులందరూ ఏ దేశానికి చెందిన వారో తెలియరాలేదు. స్థానిక కథనాల ప్రకారం ఒక భారతీయ విద్యార్థి ఉన్నారు. కత్తితో దాడికి పాల్పడిన నిందితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో పిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# భారత వ్యాక్సిన్లు రాక ఆర్థికంగా చితికిపోయాం: పాక్

ఇస్లామాబాద్: పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు. ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు. అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

# అమెరికాకే బిగ్ రిలీఫ్

### భారత్, అమెరికా ట్రేడ్ డీల్‌పై జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: భారత్, అమెరికా ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వ్యంగ్యంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. వాణిజ్య ఒప్పందంలో 'హౌడీ మోదీ' కంటే 'నమస్తే ట్రంప్' పైచేయి సాధించిందని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంలోని వివరాల ప్రస్తావన సరిగ్గా లేదని అన్నారు. ఈ ఒప్పందం విషయంలో సంయుక్త ప్రకటనలో వివరాలు సరిగ్గా ప్రస్తావించలేదని విమర్శించారు. అయితే భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోదని మాత్రం అర్థమైందని అన్నారు. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే మన వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తామని అమెరికా ప్రకటించిందని అన్నారు. దేశంలోని రైతుల ప్రయోజనాలను దెబ్బతీసి మరీ అమెరికా రైతులకు సహాయం చేకూరేలా దిగుమతులపై మన ప్రభుత్వం సుంకాలు తగ్గించనుందని విమర్శించారు. అమెరికా దిగుమతులు మూడు రెట్లు ఎక్కువగా ఉండటంతో మన వాణిజ్యం తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. మనకు చెందిన ఐటీ, ఇతర సేవల ఎగుమతులపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని అన్నారు. ఈ క్రమంలో మన ఎగుమతుల్లోని కొన్ని వస్తువులు గతంలో కంటే ఎక్కువ సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా ఈరోజు సంయుక్త ప్రకటన చేశాయి.

# సీటు సీటు నిర్ణయం కాలానిదే!

### మీడియాతో డీకే నిర్వేదం

బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తాజాగా సీఎం పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవిని డీకే ఆశిస్తున్న విషయం బహిరంగ రహస్యమే. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం ఆయననే ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెడుతుందని అంతా భావించారు. అయితే, సీఎం సీటు కోసం పోటీపడ్డ సిద్ధరామయ్య వైపే కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గుచూపింది. డీకే, సిద్ధరామయ్యలతో చర్చలు జరిపి వివాదం రేగకుండా సర్దిచెప్పింది. అప్పట్లో సీఎం సీటును డీకే, సిద్ధూ చెరో రెండున్నర సంవత్సరాలు పంచుకుంటారని, తొలుత సీఎం కుర్చీలో కూర్చున్న సిద్ధరామయ్య ఆ తర్వాత డీకేకు అవకాశం ఇస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల ఈ గడువు ముగియడంతో సీఎం మార్పుపై ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, హైకమాండ్ మాత్రం సిద్ధూను కొనసాగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే శివకుమార్ స్పందించారు. శనివారం ఆయన మీడియా ముందు నిర్వేదం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సీట్లో తాను ఎప్పుడు కూర్చుంటానో కాలమే చెబుతుందని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మార్పుపై మీడియా అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ.. సీఎం మార్పు విషయంలో తామంతా హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని డీకే స్పష్టం చేశారు.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
ఆదివారం 8-2-2026 | www.evarthalu.com



లయస్యారి చిత్రం


సోనియా బన్సాల్

## గ్రాండ్‌గా ది ప్యారడైజ్ ఎంట్రీ సాంగ్ షూట్




'న్యాచురల్ స్టార్ నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ కొనసాగుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్టుపై ఇండస్ట్రీలోనే కాకుండా ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ విజయానికే కొనసాగింపుగా ఈసారి మరింత భారీ స్థాయిలో సినిమాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శంషాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్స్‌లో నాని ఇంట్రడక్షన్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా గ్రాండ్‌గా రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. నాని కెరీర్‌లోనే ఇది అత్యంత మాస్, స్టైలిష్ ఎంట్రీ సాంగ్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది. పాటలో భారీ డ్యాన్స్ మూమెంట్స్, ప్రత్యేక సెట్స్, వందలాది మంది డ్యాన్సర్లు పాల్గొంటుండటంతో ఈ సీన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడు. రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో ఆయన కనిపించబోతున్నాడని ఇప్పటికే విడుదలైన పోస్టర్ల ద్వారా స్పష్టమైంది. కథ పరంగా కూడా ఇది యాక్షన్, ఎమోషన్, డ్రామా మేళవింపుతో ఉండబోతోందని సమాచారం. మొదట ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయాలని భావించినా, ఇప్పుడు 2026 జూలై 25కు వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## వచ్చే సంక్రాంతి బరిలో పవన్!


ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' త్వరలో విడుదల కాబోతుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషన్లతో పాటు తన కొత్త ప్రాజెక్టుపై కూడా పవన్ దృష్టి పెట్టడంతో మెగా అభిమానుల్లో కొత్త జోష్ నింపుతోంది. తాజా సమాచారం ప్రకారం, మార్చి నెలలోనే పవన్ కళ్యాణ్ మరో భారీ ప్రాజెక్టును ప్రారంభించనున్నారట. ప్రముఖ దర్శకుడు సురేందర్ రెడ్డితో పవన్ మొదటిసారి చేతులు కలుపుతున్నాడు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాను మార్చి 19న ఉగాది సందర్భంగా గ్రాండ్‌గా ప్రారంభించబోతున్నారని టాక్. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు టాక్. ఈ సినిమా షెడ్యూల్స్ విషయంలో చిత్ర బృందం పక్కా ప్లానింగ్‌తో ఉన్నట్లు తెలుస్తోంది. పవన్ రాజకీయాలకు ఆటంకం కలగకుండా, వేగంగా షూటింగ్ పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా (2027)జనవరి 12న థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## మిరాయ్ నటుడు కన్నుమూత



తేజ సజ్జా నటించిన 'మిరాయ్'లో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు సునీల్ థాపా కన్నుమూశారు. శనివారం ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖాట్మాండ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనను కాపాడటానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూనే ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని 'మిరాయ్' చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా ధృవీకరిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేసింది.

## ఒకడు నా నడుం గిల్లాడు



బిగ్ బాస్ తో మంచి ఫేమ్, క్రేజ్ తెచ్చుకున్న దివి.. తాను ఎదుర్కొన్న ఓ చేదు అనుభవాన్ని వెల్లడించారు. ఇటీవల తానొక పబ్ ఈవెంట్ కు హాజరవగా, అక్కడ తనకు ఓ చేదు అనుభవం ఎదురైనట్టు దివి తెలిపారు. ఆ ఈవెంట్ కు వెళ్లినప్పుడు తన చుట్టూ బాడీ గార్డ్స్ ఉన్నారని, గుంపుగా చుట్టూ ఉండి తనను తీసుకెళు న్నప్పటికీ, మధ్యలో ఒకడు వాళ్ల మధ్యలో నుంచి చేయి పెట్టి తన నడుమును గిల్లాడని, గిల్లడమే కాకుండా మళ్లీ ఏమీ తెలియనటటు నిల్చొని చూస్తున్నాడని, దాంతో తనకు బాగా కోపమొచ్చి, వెంటనే సీరియస్ గా చూసి తలపై గట్టిగా కొట్టి బాడకవ్ అని తిట్టి వెళ్లిపోయానని చెప్పారు.




## కావాల్సినంత ఫన్.. ఫంకీ టీమ్!

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కే వి తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రమే ఫంకీ. మంచి కామెడీ ఎంటర్టైనర్ గా ప్రామిస్ చేస్తూ వచ్చిన ఈ ట్రైలర్ నుంచి ఫైనల్ గా ట్రైలర్ కట్ ఇప్పుడు బయటకి వచ్చింది. మరి ఈ ట్రైలర్ మాత్రం మంచి ఫన్నీగా అనుదీప్ మార్క్ ఎంటర్టైనర్ గా అనిపిస్తుంది. హాస్పిటల్ లో సర్జరీ డైలాగ్ తోనే అనుదీప్ తన మార్కు స్మూత్ కామెడీ స్టార్ట్ చేసాడు. అక్కడ నుంచి నాన్ స్టాప్ ఫన్ తో ఈ ట్రైలర్ బాగా సాగింది. ఇక ఒక యువ దర్శకుడుగా విశ్వక్ సేన్ తన హీరోయిన్ గా కయాదు తమ రోల్స్ లో అనుదీప్ పాత్రల బాడీ లాంగ్వేజ్ తో కనిపిస్తున్నారు. ఇక ఇందులో భీమ్స్ స్కోర్ కూడా సినిమాలో ఫన్ టోన్ ని మ్యాచ్ చేస్తూ వినిపిస్తోంది. మొత్తానికి అయితే ఈ రానున్న వారంలో మంచి ఫన్ ఎంటర్టైన్మెంట్ ని ఫంకీ ప్రామిస్ చేస్తుంది. సో ఈ సినిమాతో కూడా మరో ఎంటర్టైనర్ ని అందించి వరుసగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ వారు అనగనగా ఒక రాజు సక్సెస్ తర్వాత సక్సెస్ స్ట్రీక్ ని కొనసాగిస్తారో లేదో చూడాలి.

## 'సాంప్రదాయిని సుప్పిని సుద్ధపూసని' ట్రైలర్ రిలీజ్

టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్ధపూసని. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా డిజిటల్ వేదికగా విడుదలవుతోంది. అయితే ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ దక్కించుకోగా.. ఈ సినిమాను ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే పంచాయితీ సెక్రటరీ అయిన శ్రీరామ్ నీతి, నిజాయితీ అంటూ బ్రతుకుతుంటాడు. అయితే అతడి జీవితంలోకి అనుకోకుండా వచ్చిన సంఘటనలు ఏంటి.. అతడిని పోలీసులు, రౌడీలు ఎందుకు వెతుకుతుంటారు అనేది ఈ సినిమా కథ. క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతుంది. ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ ఇందులో మళ్లీ జంటగా నటిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి.




## మరో అర్జున్ రెడ్డిలా 'నిలవే' ట్రైలర్!

టాలీవుడ్ యువ నటులు సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నిలవే'. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను వదిలింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సినీ ప్రియులు దీనిని సందీప్ రెడ్డి వంగా 'అర్జున్ రెడ్డి' సినిమాతో పోలుస్తున్నారు. ట్రైలర్‌లో హీరో ఎమోషన్స్, మేకింగ్ స్టైల్ మరియు రొమాంటిక్ సీన్స్ చాలా బోల్డ్‌గా ఉండటంతో నెటిజన్లు దర్శకుడు సౌమిత్ రావును సందీప్ వంగా స్టూడెంట్‌లా ఉన్నాడే అని ప్రశంసిస్తున్నారు. లవ్‌స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంలో హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, జీవన్ కుమార్ కీలక పాత్రల్లో కనిపిస్తుండగా.. సౌమిత్ రావు, సాయి వెన్నం సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి కళ్యాణ్ నాయక్ సంగీతాన్ని అందించాడు.







## వాంఖడేలో రోహిత్.. దద్దరిల్లిన స్టేడియం

ముంబైలోని వాంఖడే స్టేడియం అభిమానులతో నిండిపోగా.. అందరి కరతాళధ్వనుల మధ్య ప్రపంచకప్ అంబాసిడర్ రోహిత్ శర్మ, ఐసీసీ అధ్యక్షుడు జై షాలు ఎంట్రీ ఇచ్చారు. బ్లాక్ డ్రెస్, తెలుపు షూతో తళుక్కుమన్న రోహిత్ వరల్డ్‌కప్ ట్రోఫీతో మైదానంలోకి వచ్చాడు. అంతే.. రోహిత్.. రోహిత్.. నినాదాలతో స్టేడియం మార్మోగిపోయింది. ఈ దృశ్యం హిట్ మ్యాన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించింది.



## బుడ్డోళ్లకు బీసీసీఐ భారీ నజరానా

వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా యువ ఆటగాళ్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి కాసుల వర్షం కురిపించింది. యువ జట్టుకు బీసీసీఐరూ. 7.5 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం ఈ భారీ నగదు బహుమతిని ప్రకటించారు. "జింబాబ్వే, నమీబియాలో జరిగిన అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు రూ. 7.5 కోట్ల నగదు బహుమతిని అందజేస్తున్నాం. ఈ మొత్తాన్ని ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్, సెలక్షన్ కమిటీకి ఎలా పంపిణీ చేయాలనే దానిపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నాం" అని ఆయన తెలిపారు.






# వణికించిన అమెరికా

## చెమటోడ్చిన టీమిండియా.. సూర్య ఒంటరి పోరాటం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా శుభారంభం చేసింది. గ్రూప్-ఏలో భాగంగా అమెరికాతో వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో టీమిండియా 29 పరుగుల తేడాతో గెలుపొందింది. పసికూన అమెరికా నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైనా.. సూర్యకుమార్ యాదవ్ అద్భుత బ్యాటింగ్, బౌలర్ల అసాధారణ ప్రదర్శనతో ఓటమి నుంచి గట్టెక్కింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచినా.. బ్యాటింగ్ అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 161 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 84 నాటౌట్) ఒక్కడే అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాక్‌విక్(4/25) నాలుగు వికెట్లు తీయగా.. హర్మీత్ సింగ్(2/26) రెండు వికెట్లు పడగొట్టాడు. అలీ ఖాన్(1/13), మహమ్మద్ మోహ్‌సిన్(1/16) తలో వికెట్ తీసారు. అనంతరం అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులే చేసి ఓటమిపాలైంది. మిలింద్ కుమార్(34 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34), సంజయ్ కృష్ణమూర్తి(31 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(3/29) మూడు వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్(2/22), అర్ష్‌దీప్ సింగ్(2/18) రెండేసి వికెట్లు పడగొట్టారు. వరుణ్ చక్రవర్తి ఒక వికెట్ దక్కింది. 162 పరుగుల లక్ష్యఛేదనలో అమెరికాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన రెండో ఓవర్‌లో భారీ సిక్సర్ బాదిన ఆండ్రీస్ గౌస్.. అదే ఓవర్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన మరుసటి ఓవర్‌లో యూఎస్ఏ కెప్టెన్ మోనాంక్ పటేల్(0) డకౌటయ్యాడు. క్రీజులోకి వచ్చిన సాయితేజ ముక్కమల్ల(2)ను సిరాజ్ తన రెండో ఓవర్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో అమెరికా 13 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో మిలింద్ కుమార్, సంజయ్ కృష్ణమూర్తి అమెరికాను ఆదుకున్నారు. భారీ షాట్లతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. నాలుగో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని వరుణ్ చక్రవర్తి విడదీసాడు. ఇషాన్ కిషన్ సాయంతో మిలింద్ కుమార్‌ను స్టంపౌట్ చేశాడు. దూకుడుగా ఆడుతున్న సంజయ్ కృష్ణమూర్తిని ఔట్ చేసిన అక్షర్ పటేల్.. మరుసటి బంతికే హర్మీత్ సింగ్(0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చాడు. చివర్లో దూకుడుగా ఆడిన శుభమ్ రంజన్‌ను ఆఖరి బంతికి సిరాజ్ ఎల్బీగా పెవిలియన్ చేర్చి భారత విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

### సూర్య క్యాచ్ పట్టుంటే గెలిచేవాళ్లం

### అమెరికా కెప్టెన్

భారత బ్యాటర్లు ఇచ్చిన కీలకమైన క్యాచ్‌లను వదిలేయడం వల్లే ఓటమి పాలయ్యామని అమెరికా కెప్టెన్ మోనాంక్ పటేల్ అన్నాడు. తమ బౌలర్లు అసాధారణ ప్రదర్శనతో భారత్‌ను తక్కువ స్కోర్‌కే కట్టడి చేశారని, కానీ తమ టాప్-3 బ్యాటర్ల వైఫల్యం విజయవకాశాలను దెబ్బతీసిందని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా టీమిండియాతో వాంఖడే వేదికగా శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అమెరికా 29 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో 15 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సూర్యకుమార్ యాదవ్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను శుభమ్ రంజనే అందుకోలేకపోయాడు. ఈ క్యాచ్ అందుకొని ఉంటే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. ఈ మ్యాచ్ అనంతరం మోనాంక్ పటేల్ ఇదే విషయాన్ని ప్రస్తావించాడు. 'మా బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. ఇక్కడి పరిస్థితులను, పిచ్‌ను వారు అంచనా వేసిన తీరు మాకు మంచి మంచి మూమెంటమ్‌తో పాటు శుభారంభాన్ని అందించింది. అయితే మేం కొన్ని క్యాచ్‌లు వదిలేశాం. ఆ తప్పిదం మాకు ఓటమిని మిగిల్చింది. ఈ పిచ్‌పై 160 పరుగులు మంచి స్కోర్ అని, ఈజీగా ఛేదించవచ్చని



భావించాను. కానీ మా టాప్-3 బ్యాటర్ల వైఫల్యం మా విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో ఓడినా చాలా విషయాలు నేర్చుకున్నాం. అనేక సానుకూల అంశాలను తీసుకున్నాం. ఈ ప్రదర్శన భవిష్యత్తులో మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.'అని మోనాంక్ పటేల్ చెప్పుకొచ్చాడు.




## షెఫర్డ్ హ్యాట్రిక్

### స్కాట్లాండ్‌పై వెస్టిండీస్ ఘన విజయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని వెస్టిండీస్ ఘనంగా ప్రారంభించింది. గ్రూప్-సీలో భాగంగా స్కాట్లాండ్‌తో కోల్‌కతా వేదికగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన వెస్టిండీస్ 35 పరుగుల తేడాతో గెలుపొందింది. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ రొమారియో షెఫర్డ్ (5/20) హ్యాట్రిక్ వికెట్‌తో వెస్టిండీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మెగా టోర్నీ తొలి రోజే అతను హ్యాట్రిక్‌తో పాటు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఐపీఎల్‌లో ఆర్‌సీబీకి ఆడే రొమారియో షెఫర్డ్ ఈ మ్యాచ్ 17వ ఓవర్లో హ్యాట్రిక్ సాధించాడు. అతని ధాటికి స్కాట్లాండ్ బ్యాటర్లు క్రాస్, లీస్క్, డేవిడ్‌సన్‌లను వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. ఇదే ఓవర్ ఆరో బంతికి షరీఫ్‌ను కూడా రొమారియో షెఫర్డ్ ఔట్ చేయడంతో ఒకే ఓవర్లో 4 వికెట్లు దక్కాయి. మొత్తం 3 ఓవర్లు బౌలింగ్ చేసిన షెఫర్డ్ 20 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్‌మైర్(36 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. బ్రాండన్ కింగ్(30 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) దూకుడుగా ఆడాడు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాండ్ కర్రీ(2/22) రెండు వికెట్లు తీయగా.. సఫ్యాన్ షరీఫ్, ఒలివర్ దేవడ్సన్, మైఖేల్ లీస్క్ తలో వికెట్ తీసారు. అనంతరం స్కాట్లాండ్ 18.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిచీ బెర్రింగ్టన్(24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42), టామ్ బ్రూస్(28 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వెస్టిండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్‌తో పాటు జాసన్ హోల్డర్(3/30) మూడు వికెట్లు తీసాడు. షెమర్ జోసెఫ్, గుడకేష్ మోతీ తలో వికెట్ తీసారు.

## కష్టమ్మీద పాక్ గెలుపు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా శనివారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. 148 పరుగుల లక్ష్యఛేదనలో ఓ దశలో 114 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన పాకిస్థాన్ ఓటమి దిశగా సాగింది. కానీ ఫహీమ్ అష్రఫ్(11 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 29 నాటౌట్)అద్భుతమైన బ్యాటింగ్‌తో పాకిస్థాన్‌ను గట్టెక్కించాడు. 19వ ఓవర్ ముందు వరకు విజయం దిశగా సాగిన నెదర్లండ్స్ చివరకు ఓటమికి తల వంచింది. వాన్ బీక్ వేసిన ఈ ఓవర్‌లో ఫహీమ్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను లాంగాఫ్‌లో నెదర్లాండ్ ఫీల్డర్ వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన ఫహీమ్ రెండు మూడు సిక్స్‌లు, ఓ బౌండరీ సాయంతో 24 పరుగులు పిండుకొని పాకిస్థాన్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన నెదర్లండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ అనవసర తప్పిదాలతోనే గెలిచే మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని తెలిపాడు. 'మేం అత్యుత్తమ ప్రదర్శన చేయలేకపోయాం. ఈ మ్యాచ్‌లో ఓడినా.. గెలుపు కోసం పోరాడిన మా ఆటగాళ్లను అభినందించాలి. కొన్ని చిన్న చిన్న తప్పులు మమ్మల్ని దెబ్బతీశాయి. 160 పరుగులు చేసి ఉంటే మాకు మంచి అవకాశం ఉండేదని భావించాం. మేం ఇంకాస్త మెరుగ్గా బౌలింగ్ చేయాల్సి ఉండేది. మా బౌలర్ల అద్భుత ప్రదర్శనలు మమ్మల్ని మ్యాచ్‌లో నిలబెట్టాయి. ఇది మంచి వికెట్, పాకిస్థాన్ ఒక దశలో బంతికి ఒక పరుగు చేసే స్థితికి చేరుకుంది. కానీ అప్పుడు మేము ఒక మెయిడెన్ ఓవర్ వేయడంతో మా వాళ్ళు మళ్ళీ ఊపు అందుకున్నారు.'అని స్కాట్ ఎడ్వర్డ్స్ చెప్పుకొచ్చాడు. పాకిస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫహీమ్ అష్రఫ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ.. ఉత్కంఠ మ్యాచ్‌లు తమకు అలవాటేనని తెలిపాడు. 'గతేడాది కాలంగా మేము ఇదే తరహా క్రికెట్ ఆడుతున్నాం. హృదయ స్పందనలు పెరగడం, తగ్గడం మాకు అలవాటే.

## అమెరికా కాదు.. భారత్ ఎన్నారై టీం!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ బరిలోకి దిగిన అమెరికా జట్టును ఎన్ఆర్ఐ(ప్రవాస భారతీయుల)టీమ్‌గా పిలవవచ్చు. ఎందుకంటే ఈ జట్టులో దాదాపు 9 మంది భారత సంతతి ఆటగాళు ఉన్నారు. అంతేకాదు అందులో ఒకరిద్దరూ మినహా మిగతా వారంతా భారత దేశవాళీ క్రికెట్ ఆడినవారే కావడం గమనార్హం. చివరకు అమెరికా కెప్టెన్ మోనాంక్ పటేల్ కూడా భారత్‌కు చెందినవాడే. గుజరాత్ తరఫున అండర్ 16, అండర్ 19 క్రికెట్ ఆడాడు. భారత క్రికెట్‌లో నెలకొన్న పోటీతో అవకాశాలు రాక వారు అమెరికా పౌరసత్వం తీసుకొని ఆ జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నారు. దాంతోనే భారత్‌తో ముంబై వేదికగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో ఈ ఎన్ఆర్ఐ ఆటగాళు నిప్పులు చెరిగారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగే భారత ఆటగాళ్లకు ఊహించని షాకిచ్చారు.

**1. మోనాంక్ పటేల్:** అమెరికా కెప్టెన్ అయిన మోనాంక్ పటేల్ గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందినవాడు. అతను గుజరాత్ తరఫున అండర్-16, అండర్-19 క్రికెట్ ఆడాడు.

**2. సౌరభ్ నేత్రావల్కర్:** మహారాష్ట్రలోని ముంబైకి చెందిన సౌరభ్ నేత్రావల్కర్.. ముంబై మాజీ రంజీ ప్లేయర్. 2010 అండర్-19 వరల్డ్ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సౌరబ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ముంబైలో చదువు పూర్తి చేసిన తర్వాత, అమెరికాలోని ప్రతిష్టాత్మక కార్నెల్ యూనివర్సిటీలో మాస్టర్స్ చేశాడు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూనే.. అమెరికా జట్టులో కీలక బౌలర్‌గా రాణిస్తున్నాడు.

**3. హర్మీత్ సింగ్:** మహారాష్ట్రలోని ముంబైకి చెందిన హర్మీత్ సింగ్ కూడా ముంబై జట్టు తరఫున రంజీ క్రికెట్ ఆడాడు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోనూ అతను కొన్ని మ్యాచ్‌ల్లో బరిలోకి దిగాడు. 2012లో ప్రపంచకప్ గెలిచిన భారత అండర్-19 జట్టులో సభ్యుడుగా కూడా ఉన్నాడు. అమెరికా జట్టులో స్పిన్నర్‌గా సత్తా చాటుతున్నాడు. భారత్‌తో మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌లను పెవిలియన్ చేర్చాడు.

**4. మిలింద్ కుమార్:** ఢిల్లీకి చెందిన మిలింద్ కుమార్.. గతంలో ఢిల్లీ, సిక్కిం తరఫున రంజీ మ్యాచ్‌లు ఆడాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, ఆర్సీబీ జట్లలో కూడా సభ్యుడిగా కొనసాగాడు.

**5. శుభం రంజనే:** మహారాష్ట్రలోని ముంబైకి చెందిన శుభం రంజే.. ముంబై తరఫున రంజీ క్రికెట్ ఆడాడు. ఇతను కూడా సూర్య సారథ్యంలోనే రంజీ మ్యాచ్‌లు ఆడాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కూడా ఎంపికయ్యాడు.

**6. సాయితేజ ముక్కామల్ల:** అమెరికాలోనే స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన యువ బ్యాటర్ సాయితేజ ముక్కామల్ల. వారి తల్లిదండ్రుల స్వస్థలం ఆంధ్రప్రదేశ్.

**7. సంజయ్ కృష్ణమూర్తి:** కర్ణాటకకు చెందిన సంజయ్ కృష్ణమూర్తి.. బెంగళూరులో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. ఆ తర్వాత అమెరికాకు వెళ్లి ఆ జాతీయ జట్టు తరఫున ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.

**8. నోష్తుష్ కెంజిగే:** కర్ణాటకలోని చిక్కమగళూరుకు చెందిన నోష్తుష్ కెంజిగే అమెరికా వెళ్లాడు.

**9.జెస్సీ సింగ్:** జెస్సీ సింగ్ అమెరికాలోని న్యూయార్క్‌లో జన్మించినప్పటికీ, అతని కుటుంబ మూలాలు భారతదేశంలోని పంజాబ్ రాష్ట్రంలో ఉన్నాయి.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 8-2-2026

## దూకుడే మంత్రం.. విధ్వంసమే లక్ష్యం

భారత క్రికెట్ చరిత్రలో ఇప్పుడు ఒక అద్భుతమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు క్లాసిక్ బ్యాటింగ్‌కు, సంప్రదాయ శైలికి మారుపేరుగా నిలిచిన టీమ్ ఇండియా, ఇప్పుడు 'విధ్వంసక' పథంలో పయనిస్తోంది. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లు క్రీజులోకి అడుగుపెడితే చాలు, ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇది కేవలం బ్యాటింగ్ స్టైల్ మారడం కాదు, భారత క్రికెట్ డీఎన్ఏ మారుతోందనడానికి సంకేతం. అభిషేక్ శర్మ ఆటతీరును చూస్తుంటే, పవర్‌ప్లే అంటే కేవలం బంతులను ఆడి సెటిల్ అయ్యే సమయం కాదు, స్కోరు బోర్డును పరుగులు పెట్టించే స్వర్ణావకాశం అనిపిస్తుంది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది, భారత క్రికెట్‌లో రెండో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదు చేశాడు. తన అద్భుతమైన ఫామ్ ద్వారా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానానికి చేరుకుని, ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరిచాడు. వికెట్ పడుతుందనే భయం లేకుండా 'హై-రిస్క్, హై-రివార్డ్' పద్ధతిలో ఆడుతూ జట్టుకు మెరుపు ఆరంభాలను ఇస్తున్నాడు. మరోవైపు, వైభవ్ సూర్యవంశీ వంటి కుర్రాళ్లు రాబోయే రోజుల్లో భారత క్రికెట్ ముఖచిత్రాన్ని మార్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో అడుగుపెట్టిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. అండర్-19 ఆసియా కప్‌లో కేవలం 32 బంతుల్లోనే సెంచరీ బాది, తన దూకుడు ఏ స్థాయిలో ఉంటుందో ప్రపంచానికి చాటిచెప్పాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అతి తక్కువ వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచిన వైభవ్, భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు సరికొత్త బలాన్ని ఇస్తున్నాడు. ఈ మార్పు వెనుక బలమైన వ్యూహం ఉంది. గతంలో భారత్ వికెట్లను కాపాడుకోవడానికి ప్రాధాన్యతనిచ్చేది. కానీ ఇప్పుడు టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలను దృష్టిలో ఉంచుకుని, తొలి ఓవర్ నుంచే ఎదురుదాడికి దిగే 'ఫియర్‌లెస్' క్రికెట్‌ను ప్రోత్సహిస్తోంది. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు వస్తున్న తీరు చూస్తుంటే, రాబోయే ఐదేళ్లలో భారత క్రికెట్ మరింత దూకుడుగా, ఆధునికంగా మారనుంది. కేవలం సాంకేతికతపైనే కాకుండా, మైండ్ సెట్ మీద కూడా దృష్టి పెడుతున్న ఈ తరం ఆటగాళ్లు, ప్రత్యర్థి ఎవరైనా సరే తమదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. ఈ 'కొత్త రక్తం' భారత క్రికెట్‌కు మరిన్ని ప్రపంచ కప్పులను తెచ్చిపెడుతుందనడంలో సందేహం లేదు.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం



# లాభం.. నష్టమూ!

ఫిబ్రవరి 2026లో భారత్, అమెరికా దేశాలు కుదుర్చుకున్న 'మధ్యంతర వాణిజ్య ఒప్పందం' రెండు దేశాల ఆర్థిక బంధంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. డోనల్డ్ ట్రంప్ రెండవసారి అధ్యక్షుడైన తర్వాత భారత ఎగుమతులపై విధించిన భారీ సుంకాలను ఈ ఒప్పందం ద్వారా గణనీయంగా తగ్గించారు. 2025లో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు, వాణిజ్య అసమతుల్యత వంటి కారణాలతో అమెరికా భారత ఉత్పత్తులపై 50% వరకు రెక్రిప్రోకల్ టారిఫ్‌లను విధించింది. దీనివల్ల భారత ఎగుమతిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



తాజాగా కుదిరిన ఈ ఒప్పందం ఆ ఉద్రిక్తతలను తగ్గించింది. భారతీయ ఉత్పత్తులపై ఉన్న 50% సుంకాన్ని 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. వచ్చే ఐదేళ్లలో భారత్ అమెరికా నుంచి సుమారు $500 బిలియన్ల విలువైన ఇంధనం (చమురు, గ్యాస్), విమానాలు, సాంకేతిక పరికరాలు, బొగ్గును కొనుగోలు చేయనుంది. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసి, అమెరికా లేదా వెనిజులా నుండి దిగుమతి చేసుకోవడానికి అంగీకరించింది. అమెరికాకు చెందిన పారిశ్రామిక వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ కూడా సుంకాలను తగ్గించనుంది. ఈ ఒప్పందం భారత ఎగుమతులకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తూనే, దీర్ఘకాలికంగా చమురు, దిగుమతుల పరంగా దేశ ఆర్థిక వ్యవస్థపై కొంత భారాన్ని మోపుతుంది. అయితే, అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌ను నిలబెట్టుకోవడానికి ఇది ఒక అనివార్యమైన, వ్యూహాత్మక అడుగు.

### లాభాలు

**ఎగుమతులకు ఊతం:** సుంకాల తగ్గింపు వల్ల భారతీయ టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాల ఎగుమతులకు అమెరికాలో తిరిగి డిమాండ్ పెరుగుతుంది.

**ఉద్యోగ కల్పన:** ఎగుమతులు పెరగడం వల్ల ఎంఎస్‌ఎంఈ రంగంలో లక్షలాది మంది యువతకు, మహిళలకు ఉపాధి లభిస్తుంది.

**వ్యూహాత్మక సంబంధం:** రక్షణ, సాంకేతిక రంగాలలో అమెరికాతో సంబంధాలు మరింత బలోపేతం అవుతాయి.

**సున్నా సుంకం లబ్ధి:** జెనరిక్ మందులు, విమాన భాగాల వంటి కొన్ని రంగాలకు సున్నా సుంకం సౌకర్యం లభిస్తుంది.

### సవాళ్లు

**ఖరీదైన ఇంధనం:** రష్యా నుంచి లభించే రాయితీ చమురును వదులుకుని, అమెరికా నుంచి ఖరీదైన చమురు కొనడం వల్ల భారతదేశ ఇంధన వ్యయం పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు.

**వాణిజ్య లోటు:** $500 బిలియన్ల కొనుగోళ్ల హామీ వల్ల ప్రస్తుతమున్న వాణిజ్య మిగులు తగ్గి, విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పడవచ్చు.

**వ్యవసాయ రంగంపై ఆందోళన:** అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తలుపులు తీయడం వల్ల స్థానిక రైతుల ప్రయోజనాలకు భంగం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, సున్నితమైన వ్యవసాయ ఉత్పత్తులను రక్షించినట్లు భారత ప్రభుత్వం పేర్కొంది. భారత రైతుల పట్ల సానుకూల వైఖరి ఉంటే డీల్‌కు తిరుగులేదు.

- సంజయ్ కుమార్ పిడికిలి, వరంగల్



(నేడు భానుసప్తమి)

## శారీరక శక్తికి సూర్యుడు

ఆరోగ్య ప్రదాత, సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడైన సూర్య భగవానుడికి అత్యంత ప్రీతికరమైన పర్వదినం భాను సప్తమి. సప్తమి తిథి ఆదివారం కలిసి వచ్చిన రోజునే భాను సప్తమి లేదా సూర్య సప్తమి అని వ్యవహరిస్తారు.

పురాణాల ప్రకారం, కశ్యప ప్రజాపతి మరియు అదితి దంపతులకు సూర్య దేవుడు ఈ రోజే జన్మించారు. సాధారణ ఆదివారం లేదా సప్తమి రోజున చేసే పూజ కంటే, భాను సప్తమి నాడు చేసే జప, హోమ, దానాలు కోటి రెట్ల పుణ్యఫలాన్ని ఇస్తాయని శాస్త్ర వచనం. సూర్యుడిని "ఆరోగ్య ప్రదాత" అని పిలుస్తారు. ఈ రోజు సూర్యారాధన చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుండి విముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. సూర్యోదయానికి ముందే మేల్కొన్న నదుల్లో లేదా పవిత్ర జలాల్లో స్నానం చేయడం అత్యంత శ్రేష్టం. ఇది గంగా స్నానంతో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని భావిస్తారు. రాగి పాత్రలో నీటిని తీసుకుని, అందులో ఎర్రటి పువ్వులు, అక్షతలు, బెల్లం కలిపి సూర్యుడికి ఎదురుగా నిలబడి అర్ఘ్యం వదలాలి. "ఓం ఘృణి సూర్యాయ నమః" లేదా గాయత్రీ మంత్రం, ఆదిత్య హృదయం పఠించడం వల్ల మానసిక ప్రశాంతత, సంకల్ప బలం పెరుగుతాయి. ఆవుపాలతో చేసిన పరమాన్నం లేదా బెల్లం పొంగలిని సూర్య భగవానుడికి నైవేద్యంగా సమర్పించాలి. గోధుమలు, బెల్లం, రాగి పాత్రలు లేదా ఎర్రటి వస్త్రాలను పేదలకు దానం చేయడం ద్వారా గ్రహ దోషాలు తొలగిపోతాయి. ఈ రోజు 108 సూర్య నమస్కారాలు చేయడం వల్ల శారీరక శక్తి పెరగడమే కాకుండా, శరీరంలోని చక్రాలు ఉత్తేజితమవుతాయి. భక్తితో ఈ రోజు ఉపవాసం ఉండేవారు గత జన్మల పాపాల నుండి విముక్తి పొందుతారని నమ్మకం. సూర్యారాధన ద్వారా కంటి చూపు మెరుగుపడుతుందని, చర్మ వ్యాధులు తగ్గుతాయని ఆయుర్వేదంలో కూడా పేర్కొనబడింది.



బండపెల్లి రాం మనోహర్ శర్మ,
ఆధ్యాత్మిక పండితుడు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.